**PCW తెలుగు దినపత్రిక**

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 127 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 04 మే 2026


## అలియాబాద్‌లో చలివేంద్రం ప్రారంభం




3లో

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభం


3లో

# కక్ష్యలోకి భారత్ దృష్టి

- ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ ఉపగ్రహం
- భారత్‌లోని ప్రయివేటు సంస్థ నిర్మించిన అతిపెద్ద శాటిలైట్


2లో

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం...

9 మంది మృతి.. నలుగురికి గాయాలు

ఏసీ పేలుడే కారణమని అనుమానం


2లో


## నేడే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు..


2లో

# ఒప్పందం చేసుకోండి..లేకుంటే విపత్తే...

## - ట్రంప్ బెదిరింపులు

- దౌత్యమా..యుద్ధమా.. నిర్ణయించుకోవాల్సింది అమెరికానే : ఇరాన్
- కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, యుద్ధం ముంచుకొచ్చే ప్రమాదం



**అమెరికా,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):**అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే, ఇరాన్‌పై మళ్లీ దాడి చేయవచ్చని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో పాటు మూడు కీలక అంశాలైన అణు కార్యక్రమం, హార్ముజ్ దిగ్బంధనం, భద్రతా హామీలు వంటి అంశాలపై ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోంది. మరోవైపు ట్రంప్ ను ఏమాత్రం నమ్మలేమని ఇరాన్ అంటోంది. సముద్రపు దొంగల్లాంటి వాళ్లమంటూ ప్రకటనతో కూడా ఇరాన్ మరింత అప్రమత్తమైంది. అందుకే మా వ్యూహాల్లో మేం ఉన్నామంటూ ప్రతిస్పందిస్తోంది. దీంతో యుద్ధం జరగవచ్చనే భయాన్ని రేకెత్తిస్తోంది. మిగతా2లో...

# నగల దుకాణంలో కాల్పులు




**కరీంనగర్ క్రైం,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రశాంతంగా ఉండే కరీంనగర్ నగరం ఆదివారం ఉదయం తుపాకీ మోతలతో ఉలిక్కిపడింది. కరీంనగర్‌లోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ షాపును టార్గెట్ చేసిన ఐదుగురు దొంగల ముఠా తుపాకులతో దాడిచేసి బంగారు నగలను దోచుకెళ్లారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఉద్యోగులపై కాల్పులు జరిపి సంచలనం సృష్టించింది. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో, అదికూడా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న పిఎంజె జ్యువెలరీ షోరూమ్‌లో దుండగులు జరిపిన భారీ దోపిడీ మిగతా2లో...

# రాష్ట్రంపై అల్పపీడన ద్రోణి ప్రభావం

రెండ్రోజులపాటు పలు జిల్లాల్లో వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



**హైదరాబాద్,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత కొన్ని రోజులుగా భానుడి భగభగలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురు అందించింది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో ఎండల నుంచి తాత్కాలిక ఉపశమనం కలిగే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 48 గంటలపాటు రాష్ట్రంలో అల్పపీడన ద్రోణి ప్రభావం మిగతా2లో...

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కుట్ర

- జీవో 7 అందుకోసమే..
- 14 లక్షల మంది విద్యార్థులకు వెన్నుపోటు
- వైఎస్ పథకాలకూ పాతరేస్తున్న సర్కారు
- విద్యార్థిలోకం గర్జిస్తే మంత్రులు రోడ్లపై తిరగరు
- రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలి : సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ




**హైదరాబాద్,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** రేండున్నరేండ్ల కాంగ్రెస్ అసమర్థ పాలనలో ఇప్పటికే విద్యావ్యవస్థను కుప్పకూలిందని బీఆర్ఎస్ వర్కింగ్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఇప్పుడు ఏకంగా ఉన్నత చదువులకు నిరుపేదలను పూర్తిగా దూరం చేసేలా విద్యార్థులకు వెన్నుపోటు పొడుస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు కొండంత అండగా నిలిచే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసే కుట్ర భయంకరమైనదని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ ఏడును తెచ్చిందని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఆదివారం లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ అని తెలంగాణ సమాజానికి అర్థమైపోయిందని పేర్కొన్నారు. ఈ జీఓ వచ్చిన క్షణం నుంచి విద్యార్థులకే కాదు, లక్షలాది మంది నిరుపేద తల్లిదండ్రులకు కూడా కంటి మీద కునుకు కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖను విధ్వంసం చేసేందుకే ఆ శాఖను పర్యవేక్షిస్తున్నారా?అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కేసీఆర్ స్కీంలనే కాకుండా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన మిగతా2లో...



# ప్రశాంతంగా నీట్

- జూన్ మొదటి వారంలో ఫలితాలు?
- దేశవ్యాప్తంగా 22.7 లక్షల మంది హాజరు

**హైదరాబాద్,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):**దేశంలోని ప్రభుత్వ, ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు ఇతర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) యూజీ-2026 మిగతా2లో...

# అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు

త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇండ్ల మంజూరు :

ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా


2లో

# పోలీసులు నిందితులను పట్టుకుంటారనే నమ్మకం నాకు ఉంది: బండి


2లో

# ఒప్పందం చేసుకోండి..లేకుంటే విపత్తే...

(మొదటి పేజీ తరువాయి)

**ఇరాన్ బలహీనం, ఒప్పందం తప్పనిసరి** ప్రతి వారం కొత్త సవరణలతో ప్రతిపాదనలు వస్తున్నా, ఏవీ ఆమోదం పొందడం లేదు. ఇరాన్ ఒకప్పుడు ఉన్నంత బలంగా ఇప్పుడు లేదని ట్రంప్ అంటున్నారు. ఆయన ప్రకారం, వారికి ఒప్పందం కావాలి. వారు పూర్తిగా బలహీనపడ్డారు. తమ నాయకుడు ఎవరో కూడా వారికి అర్థం కావడం లేదు. వారు నిస్సహాయులు. అని యూఎస్ అధ్యక్షుడు పేర్కొంటున్నారు. ఒప్పందం కుదరకపోతే ఏమి జరుగుతుందనేదే అతిపెద్ద ప్రశ్న. సైనిక చర్య ఒక ప్రత్యామ్నాయం అని ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు."నేను ఇప్పుడే చెప్పలేను, కానీ వారు తప్పుడు నిర్ణయం తీసుకుంటే, అది సాధ్యమే" అని ఆయన అన్నారు. అమెరికా దాడి చేసే అవకాశాన్ని తెరిచి ఉంచుకుంటోందని ఇది స్పష్టంగా సూచిస్తోంది. ఇదిలా ఉండగా, హార్ముజ్ జలసంధిపై ఉద్రిక్తతలు తీవ్రమవుతూనే ఉన్నాయి. అమెరికా దిగ్బంధనం ఇరాన్ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపింది. **సైనిక చర్యకు అవకాశం ఉంది : ట్రంప్** ఇరాన్‌పై సైనిక చర్యకు అవకాశం ఉన్నదని ట్రంప్ సూచనప్రాయంగా చెప్పారు. 'వారి ప్రవర్తన సరిగా లేకపోతే, వారు చెడ్డ పని చేస్తే ఏం చేయాలో చేస్తాం.

సైనిక చర్యకు అవకాశం ఉంది కచ్చితంగా' అని ఆయన ఫ్లోరిడాలో తెలిపారు. కాగా ఇరాన్‌పై యుద్ధం చేయడానికి తనకు కాంగ్రెస్ అనుమతి అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా చట్టం ప్రకారం సైనిక చర్య చేపట్టాలంటే దేశాధ్యక్షుడికి ప్రతినిధిసభ అనుమతి తప్పనిసరి. అయితే ట్రంప్ తాజాగా కాంగ్రెస్ సభ్యులకు లేఖ రాస్తూ యుద్ధ అధికారాల చట్టానికి తాను కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. ఇరాన్‌తో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందం ఏప్రిల్ 7వ తేదీ నుంచి కొనసాగుతోందని, కాబట్టి ఫిబ్రవరి 28న ప్రారంభమైన శత్రుత్వం ముగిసిందని గుర్తు చేశారు. ఇదిలావుండగా హార్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు ఇరాన్‌కు వ్యక్తులు కానీ, కంపెనీలు కానీ టోల్ చెల్లిస్తే తమ ఆంక్షలను ఉల్లంఘించినట్లు అవుతుందని అమెరికా ఆర్థిక శాఖ ఓ నోటీసులో హెచ్చరించింది. **అమెరికా దిగ్బంధాన్ని తప్పించుకున్న ఇరాన్ సూపర్ ట్యాంకర్** జాతీయ ఇరాన్ ట్యాంకర్ కంపెనీ (ఎన్ఐటీసీ)కి చెందిన అతి పెద్ద ముడి చమురు రవాణా నౌక సూపర్‌ట్యాంకర్ అమెరికా దిగ్బంధాన్ని దాటుకొని ఆసియా -- పసిఫిక్ ప్రాంతంలోకి విజయవంతంగా ప్రవేశించింది. ఈ నౌకలో 1.9 మిలియన్ బ్యారల్స్ ముడి చమురు ఉంది. ఈ ట్యాంకర్ ప్రస్తుతం ఇండొనేషియాలోని లాంబక్ జలసంధి మీదుగా రియావూ ద్వీపసమూహం వైపు ప్రయాణిస్తోంది. ఈ నౌక వారం రోజుల క్రితం శ్రీలంక తీరంలో కన్పించిందని ట్యాంకర్ ట్రాకర్స్.కామ్ తెలిపింది. కనీసం 52 నౌకలు అమెరికా దిగ్బంధాన్ని విజయవంతంగా ఉల్లంఘించాయని ఇరాన్ ప్రభుత్వ మీడియా గత నెల 29న తెలియజేసింది. **నేర స్వభావాన్ని అంగీకరించారు : ట్రంప్ 'సముద్ర దొంగతనం' వ్యాఖ్యపై ఇరాన్** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన నేర స్వభావాన్ని నేరుగానే అంగీకరించారని ఇరాన్ తెలిపింది. ఇరాన్ నౌకలపై అమెరికా నౌకాదళ చర్యలను ట్రంప్ 'సముద్ర దొంగతనం'తో పోల్చారు. దీనిపై ఇరాన్ ఘాటుగా స్పందిస్తూ ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని కోరింది. సముద్రంలో చట్టవిరుద్ధ ప్రవర్తనను ట్రంప్ బహిరంగంగానే సమర్థిస్తున్నారని ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై విమర్శించారు. 'ఇరాన్ నౌకలను చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకోవడాన్ని సముద్ర దొంగతనంగా ట్రంప్ బహిరంగంగానే అభివర్ణించారు. అంటే తాము సముద్ర దొంగల మాదిరిగా ప్రవర్తిస్తున్నామని ఆయన చెబుతున్నారు. ఇక్క మాట తూలడమంటూ ఏమీ లేదు. వారి చర్యలు అంతర్జాతీయ సముద్రయాన నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఇది వారి నేర స్వభావాన్ని బాహాటంగానే బయటపెడుతోంది. అంతర్జాతీయ సమాజం, ఐరాస సభ్య దేశాలు, ఐరాస సెక్రటరీ జనరల్ జోక్యం చేసుకొని ట్రంప్ చర్యలను ఖండించాలి' అని ఆయన అన్నారు. అంతకుముందు ట్రంప్ మాట్లాడుతూ 'మేము నౌకలను స్వాధీనం చేసుకున్నాం. సరకు రవాణా నౌకలను స్వాధీనం చేసుకున్నాం. ఇది చాలా లాభదాయకమైన వ్యాపారం. మేము సముద్రపు దొంగల వంటివారం. కానీ మేము ఆటలు ఆడం' అని చెప్పారు. **ఇరాన్ తాజా ప్రతిపాదనలో ఏముంది?** అమెరికాకు పాకిస్తాన్ ద్వారా ఇరాన్ 14 సూత్రాల శాంతి ప్రతిపాదనను పంపిందని టెహ్రాన్ వార్తా సంస్థలు తస్నిమ్, ఫార్స్ అంతకుముందు తెలియజేశాయి. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేసే వరకూ ఒప్పందం కుదుర్చుకునే ప్రశ్నే లేదని ట్రంప్ ఇప్పటికే అనేక సందర్భాలలో స్పష్టం చేశారు. ఇరాన్ తాజా ప్రతిపాదన ప్రకారం...ఇరాన్ పరిసర ప్రాంతాల నుంచి అమెరికా దళాలు వైదొలగాలి. హార్ముజ్ జలసంధి దిగ్బంధాన్ని తొలగించాలి. ఇరాన్ ఆస్తులపై ఫ్రీజింగ్‌ను తొలగించాలి. యుద్ధంలో జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలి.హార్ముజ్ జలసంధిపై నియంత్రణకు సంబంధించి కొత్తగా ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.రెండు నెలల పాటు కాల్పుల విరమణను కొనసాగించాలని అమెరికా ప్రతిపాదించగా అందుకు ఇరాన్ ఇష్టపడడం లేదు. అన్ని కీలక అంశాలను 30 రోజుల్లో పరిష్కరించుకోవాలని పట్టుబడుతోంది. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో భద్రత, ఆర్థిక అంశాలపై ఇరాన్ దృష్టి పెట్టింది. అమెరికా -- ఇజ్రాయిల్ దాడుల కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ మొదటి నుంచీ కోరుతూనే ఉంది.

# కక్ష్యలోకి భారత్ దృష్టి

**కాలిఫోర్నియా,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** బెంగళూరుకు చెందిన అంతరిక్ష అంకుర సంస్థ గెలాక్స్ఐ పంపించిన 'దృష్టి' ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లింది. కాలిఫోర్నియాలోని ప్రయోగ కేంద్రం నుంచి ఫాల్కన్-9 రాకెట్ సాయంతో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్టు గెలాక్స్ఐ వెల్లడించింది. ఇది ప్రపంచంలో ఆప్టో-సార్ సాంకేతిక కలిగిన మొట్టమొదటి ఉపగ్రహమని పేర్కొంది. భూ పరిశీలన సాంకేతికత పరిజ్ఞానంలో ఇది కీలక మైలురాయి అని తెలిపింది. "190 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం.. భారత్‌లోని ప్రయివేటు సంస్థ కక్ష్యలోకి భారత్ దృష్టి నిర్మించిన శాటిలైట్లలో అతిపెద్దది. 1.5 మీటర్ల రిజల్యూషన్‌తో చిత్రాలను అందిస్తుంది. ఆప్టో-సార్ టెక్నాలజీతో ఇది పనిచేస్తుంది. ఎలక్ట్రో ఆప్టికల్ (ఈఓ), సింథటిక్ ఎపెర్చర్ రాడార్ (ఎస్ఏఆర్) సెన్సర్లతో కలిపి పరిశీలనలు సాగిస్తుంది. అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లో.. పగలు, రాత్రి తేడా లేకుండా భూమిని నిరంతరం పరిశీలించే సామర్థ్యం దీని సొంతం" అని గెలాక్స్ఐ పేర్కొంది. గెలాక్స్ఐ చేపట్టిన దృష్టి ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం పట్ల ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష పరిశోధనల్లో ఇదో కీలక విజయంగా నిలుస్తుందన్నారు. దేశ పురోగతి, ఆవిష్కరణల పట్ల యువత అభిరుచికి ఇదో నిదర్శనమన్నారు.

# ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం..

**న్యూఢిల్లీ,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీలోని వివేక్ విహార్‌లో ఆదివారం తెల్లవారుజామున ఒక నాలుగు అంతస్తుల భవనంలో మంటలు చెలరేగి తొమ్మిది మంది మరణించగా మరో నలుగురు గాయపడ్డారు. ఏసీ పేలుడు కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమిక ఆధారాలను బట్టి తెలుస్తున్నది. అగ్నిప్రమాదం గురించి తెలిసిన వెంటనే 12 అగ్నిమాపక శకటాలు అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశాయి. మరణించిన తొమ్మిది మందిలో ఐదు మృతదేహాలు భవనంలోని రెండవ అంతస్తులో లభించాయి. మరో మూడు మృతదేహాలు మెట్ల పైన లభించాయి. మరో వ్యక్తి మృతదేహం మొదటి అంతస్తులో లభించింది.మృతులలో ఏడాది వయసున్న బాలుడు కూడా ఉన్నాడు. నలుగురు పురుషులు, నలుగురు మహిళలు, ఒక చిన్నారి మరణించినట్లు పోలీసులు తెలిపారు. డజను మందికిపైగా భవన నివాసితులను రక్షించినట్లు సహాయక సిబ్బంది చెప్పారు. భవనంలోని రెండు, మూడు, నాలుగవ అంతస్తులకు మంటలు వ్యాపించినట్లు పోలీసులు చెప్పారు.

# నేడే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు..

**హైదరాబాద్, 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని మొత్తం 824 నియోజకవర్గాల్లో నమోదైన ఓట్ల లెక్కింపు మే 4వ తేదీ సోమవారం రోజు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటల కల్లా ఏ రాష్ట్రంలో ఎవరిది గెలుపనేది పూర్తిగా తెలిసిపోతుంది. తొలి గంటలో పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు రాష్ట్రాల వారీగా భిన్నంగా ఉన్నాయి.

# రాష్ట్రంపై అల్పపీడన ద్రోణి ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగే వీలున్నదని అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్రంలోని తూర్పు జిల్లాల్లో కొనసాగుతున్న వడగాడ్పుల తీవ్రత నేటితో ముగియనుండగా, పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు.ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ సహా పలు జిల్లాలకు ఉరుములతో కూడిన వర్షం కురువనున్నట్టు హెచ్చరికలు జారీచేశారు. హైదరాబాద్‌లో మే 6 నుంచి వర్షాల తీవ్రత పెరుగనున్నదని వెల్లడించారు. ఆదివారం దాదాపు 12 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేశారు. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 46 డిగ్రీలు, నల్లగొండ జిల్లా అనుముల, నిర్మల్ జిల్లా ఖానాపూర్, సిద్దిపేట జిల్లా తొగుటలో 45.9 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 45.8, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 45.8, ఖమ్మంలో 45.6, కరీంనగర్, మెదక్‌లో 44.6, మహబూబ్‌నగర్‌లో 44.2 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నల్లగొండ, యాదాద్రి భువనగిరి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. సోమ, మంగళవారాల్లో కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అధికారులు అంచనావేశారు.

# నగల దుకాణంలో కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

స్థానికంగా కలకలం రేపుతోంది.దోపిడీ సమయంలో అడ్డుకోబోయిన కమల్, ముస్తాక్, రాజేష్, మధుకర్ అనే నలుగురు ఉద్యోగులపై దుండగులు కాల్పులు జరిపారు. తుపాకీ గాయాలకు గురైన బాధితులను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు, బుల్లెట్లు, మ్యాగ్జిన్ స్వాధీనం చేసుకున్నారు. సీసీ టీవీ పు టేజీ ఆధారంగా నిందితుల ఫొటోలను విడుదల చేసి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.నిందితులు తెలుగు, హిందీ మాట్లాడినట్లు తెలిసి నార్త్ ఇండియా ముఠా కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఈ ఘటనతో పోలీసులు ఉమ్మడి జిల్లాలో హై అలెర్ట్ ప్రకటించి ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటన గతంలో చొప్పదండి ఎస్బీఐ బ్యాంకులో జరిగిన సంచలన దోపిడీని గుర్తుకుతెస్తున్నది.ఈ దోపిడీలో నిందితులు కనీసం ముఖాలకు మాస్కులు కూడా ధరించకుండా బహిరంగంగానే ఆయుధాలతో షోరూమ్‌లోకి ప్రవేశించారు. ఉదయం 11 గంటల సమయంలో జనం రద్దీ ఉన్నా భయం లే కుండా వ్యవహరించడం వారి తెగింపునకు నిదర్శనంగా కనిపిస్తోం ది. దుండగులు కేవలం సాధారణ దొంగల్లా కాకుండా, శిక్షణ పొం దిన నేరస్థుల్లా వ్యవహరించారు. తుపాకులు చూపి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసి నగదు, బంగారంతో పరారయ్యారు. **రంగంలోకి ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి** తీవ్రత దృష్ట్యా మల్టీజోన్- 1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఐపీఎస్ కరీంనగర్‌లో స్వయంగా పర్యటించారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఐజీపీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫోరెన్సిక్ ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజీని విశ్లేషించి, దర్యాప్తు పురోగతిపై అధికారులకు కీలక ఆదేశాలు జారీచేశారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లిన ఐజీపీ, చికిత్స పొందుతున్న ఉద్యోగులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశిస్తూనే, నేరస్థులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని బాధితులకు భరోసా ఇచ్చారు. **నిఘా వైఫల్యమా? ఉగ్రవాద కోణమా?** నగరం నడిబొడ్డున, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆఫీస్ దగ్గరగా ఉండగా వీవీఐపీల కదలికలు ఎక్కువగా ఉండేచోట ఇంతటి సాహసానికి నేరస్థులు ఒడిగట్టడం భద్రతా వ్యవస్థలోని లోపాలను వేలెత్తి చూపుతోంది. గతంలో చొప్పదండి ఎస్బీఐ బ్యాంకులో జరిగిన రూ.40 లక్షల దోపిడీ కేసులో నిందితులు పశ్చిమబెంగాల్‌లో జరిగిన బాంబుబ్లాస్ట్‌లో మరణించగా వారి దగ్గర ఉన్న నగదు చొప్పదండి ఎస్బీఐ బ్యాంకులో దోపిడీ చేసిన నగదుగా నిర్ధారించారు, కాగా సదరు నేరస్థులకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఇప్పుడు జరిగిన పీఎంజే దోపిడీ శైలి కూడా దానికి దగ్గరగా ఉండటంతో, మళ్లీ అంతర్రాష్ట్ర 'టెర్రర్ మాడ్యూల్స్' జిల్లాలోకి ప్రవేశించాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. **ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్?** నిందితులు ఆయుధాలతో బైక్‌లపై నగరం నడిబొడ్డున తిరుగుతున్నా ఇంటెలిజెన్స్ పసిగట్టలేకపోవడం గమనార్హం. నిందితులు మారణాయుధాలతో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సీసీ టీవీ ఫుటేజీలో కనిపిస్తున్న ముఖాలను బట్టి ఎవరైనా గుర్తిస్తే వెంటనే సమాచారం కోసం డయల్ 100, 8712670744, 8712670745 నెంబర్లకు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

పథకాలనూ పాతరేస్తారా?అని అడిగారు. ఓవైపు గురుకులాలను దెబ్బతీసి ఉన్నత విద్యకూ ఉరివేస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దుర్మార్గమైన జీవో నెంబర్ ఏడును వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉన్న 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేద విద్యార్థులతో దండుకట్టి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని తెలిపారు. ఇప్పటికే అన్నదాతల ఆందోళనలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో దగాపడ్డ విద్యార్థులు గర్జిస్తే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# ప్రశాంతంగా నీట్

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జూన్ మొదటి వారంలో ఫలితాలు విడుదలయ్యే అవకాశ ముందని తెలిసింది. దేశవ్యాప్తంగా 552 నగరాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. దేశవ్యాప్తంగా 22,79,743 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వారిలో 13,32,928 మంది అమ్మాయిలు, 9,46,815 మంది అబ్బాయిలున్నారు. దరఖాస్తు చేసిన వారిలో 22.7 లక్షల మంది పరీక్షకు హాజరైనట్టు సమాచారం. దేశవ్యాప్తంగా 13 భాషల్లో నీట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించింది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయా ళం, మరాఠీ, ఒరియా, పంజాబీ, తమిళంతో పాటు ఉర్దూ భాషలోనూ నిర్వహించారు. నీట్ పరీక్షను తెలంగాణలో 24 పట్టణాల్లో 199 కేంద్రాల్లో జరిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, గద్వాల, జగిత్యాల, జనగామ, కొత్తగూడెం, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, నల్లగొండ, నిజామాబాద్, సిద్ధిపేట, సూర్యాపేట, వికారాబాద్, హైదరాబా ద్, సికింద్రాబా ద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లో ఈ పరీక్షను నిర్వహించారు. రాష్ట్రం నుంచి సుమారు 73 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేస్తే 71,500 మంది పరీక్షకు హాజరైనట్టు తెలిసింది. అయితే నీట్ పరీక్షలో ఫిజిక్స్ ప్రశ్నలు కొంత కఠినంగా వచ్చినట్టు నిపుణులు, విద్యార్థులు అభిప్రాయపడ్డారు. మిగిలిన బయాలజీ, కెమిస్ట్రీ ప్రశ్నలు సాధారణంగానే వచ్చినట్టు సమాచా రం. నీట్ ప్రశ్నాపత్రంలో ఎక్కువ ప్రశ్నలు ఎన్సీఈఆర్టీ సిలబస్ నుంచే వచ్చాయన్న అభిప్రాయం వచ్చింది. **నీట్ విద్యార్థులకు కేటీఆర్ శుభాకాంక్షలు...** నీట్ పరీక్షకు హాజరైన్న విద్యార్థులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఆదివారం స్పందిస్తూ విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపారు. నీట్ విద్యార్థులు ఏండ్ల తరబడి కష్టపడి, అంకితభావం వారిని ఈ స్థాయికి తీసుకొచ్చాయని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో ఆందోళన చెందకుండా, ప్రశాంతంగా ఉండాలని సూచించారు.


# అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు

- **త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇండ్ల మంజూరు :**
- **ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా**

**కూసుమంచి,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

సాదా బైనామా, నిషేధిత జాబితా , భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని, మే నెలాఖరు నాటికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నా మని తెలిపారు. మే 5 నుంచి 7 వరకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు నిందితులను పట్టుకుంటారనే నమ్మకం నాకు ఉంది: బండి



**హైదరాబాద్,మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** పథకం ప్రకారమే ఈ దొంగతనం జరిగిందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. సమాచారం తెలియగానే తాను ఇక్కడికు వచ్చానని అన్నారు. కరీంనగర్ పిఎంజె షాపులో కాల్పుల కలకలం రేపిన ఘటనపై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చోరీ ఘటనపై సిపి గౌస్ ఆలంను అడిగి తెలుసుకుంటున్నామని, పోలీసులు విచారణ ప్రారంభించారని తెలియజేశారు. గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారని, కొందరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తున్నారని అన్నారు. నిందితులు తెలుగు, హిందీ మాట్లాడుతున్నట్టు తెలిసిందని, మొత్తం ఐదుగురు వచ్చినట్టు తెలుస్తోందని అన్నారు. క్లూస్ టీమ్ వివరాలు తీసుకుంటున్నారని, నిందితులను తప్పకుండా పట్టుకుంటారన్న నమ్మకం తనకు ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్(పి,ఈ) ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

**• జర్నలిస్టులకు ఘన సన్మానం**





**ఉప్పల్ మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్అండ్ ఎలక్ట్రానిక్ ) ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం ఘనంగా జరిగింది. చిలుకానగర్‌లోని నోవా బ్లాంకెట్ హాల్‌లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డెపల్లి కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, ఉప్పల్ నియోజకవర్గ బీసీ జేఏసీ నాయకులు నేర్ధం భాస్కర్‌గౌడ్, చిల్కానగర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు జల్లి మోహన్ లు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా జర్నలిస్టులను ఘనంగా సన్మానించి మెమొంటో డైరీ లను అందజేసి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీఆర్ఎస్ నాయకులు నేర్ధం భాస్కర్‌గౌడ్, జల్లి మోహన్ లు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. నిజాలను వెలికితీసి ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు సమాజానికి ఎంతో విలువైనవని అభినందించారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశేష కృషి చేసిన జర్నలిస్టులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. మెమంటోలను, డైరీలను అందచేశారు. కొంతమంది సీనియర్ పాత్రికేయులు తమ అనుభవాలను పంచుకుంటూ, యువ జర్నలిస్టులు నిజాయితీతో, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆనంద నర్సింహారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ లు పయ్యావుల సంతోష్, కీర్తి సంతోష్ రాజ్, జిఎస్ నాగరాజు లతోపాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# హిందువుల ఐక్యతే శాశ్వత పరిష్కారం: సద్గురు మహదేవ్ స్వామీజీ పిలుపు







**సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి**

**హిందూ ధర్మ పరిరక్షణ సమితి పోచమ్మకుంట బస్తి ఆధ్వర్యంలో ఘనంగా హిందూ ధర్మ సమ్మేళనం**

**హనుమకొండ, మే 3(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో హిందువులు ఎదుర్కొంటున్న సామాజిక, సాంస్కృతిక సమస్యలకు సంఘటిత హిందూ సమాజంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమని ఆధ్యాత్మికవేత్త సద్గురు మహదేవ్ స్వామీజీ అన్నారు. శనివారం సాయంత్రం హనుమకొండ హనుమాన్ నగర్‌లోని దాసాంజనేయ స్వామి ఆలయ మైదానంలో సాయంత్రం ఆత్మకూర్ దేవేంద్ర చారి అధ్యక్షతన నిర్వహించిన హిందూ ధర్మ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. హిందూ ధర్మ పరిరక్షణ సమితి పోచమ్మకుంట బస్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి, భవ్యతల సమ్మేళనంగా నిలిచింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సద్గురు మహదేవ్ స్వామీజీకి కమిటీ సభ్యులు, జాగృతి మహిళలు కోలాటాల మధ్య, కరతాళ ధ్వనులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సద్గురు మహదేవ్ స్వామీజీ మాట్లాడుతూ.. హిందువుల ఐక్యతే భవిష్యత్తుకు బలమని స్పష్టం చేస్తూ, సనాతన ధర్మ విలువలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ప్రాముఖ్యంగా ఉద్ఘాటించారు. మహిళల పాత్ర, కుటుంబ బాంధవ్యాల పరిరక్షణ, ధర్మ సంరక్షణలో సమాజం తీసుకోవాల్సిన బాధ్యతలపై ప్రేరణాత్మకంగా మాట్లాడారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలంటే ఐక్యతే ప్రధాన మార్గమని హితవు పలికారు. దేశంలో హిందువులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం సంఘటిత హిందూ సమాజ ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హిందూ ధర్మం, భారతదేశం విడదీయరాని తత్వాలని, ఒకటి ఆత్మ అయితే మరొకటి దేహమని అన్నారు. హిందూ ధర్మం గొప్పతనం "కలిసి బ్రతకడం బ్రతకనివ్వడం" అనే విలువలలో ప్రతిఫలిస్తుందని చెప్పారు. ఇతర మతాలను కూడా ఆదరించి, ఆశ్రయం ఇచ్చిన విశాల హృదయం హిందూ ధర్మానిదేనని పేర్కొన్నారు. అయితే కాలక్రమేణా ఆశ్రయం పొందిన వారే ఆక్రమణ ధోరణితో హిందువులపై దాడులు, మత మార్పిడులు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలంటే హిందువులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ విభాగ సంపర్క్ ప్రముక్ జూలపెల్లి కరుణాకర్ రావు, రాష్ట్ర సేవిక సమితి జిల్లా నాయకురాలు వాంకుడోత్ జ్యోతి తమ సందేశంలో ప్రపంచంలోనే అత్యున్నత కుటుంబ వ్యవస్థ, వైవాహిక సంప్రదాయాలు భారతదేశానికి ఉన్నప్పటికీ ప్రస్తుతం కుటుంబ విలువలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సంఘటిత హిందూ సమాజం కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం వేలాదిగా తరలివంచిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభం

**వేసవి ఎండలకు ఉపశమనం కలిగించేందుకు ప్రజలకు సేవా కార్యక్రమం**







**కల్లూరు, మే 3 (పిసిడబ్ల్యూన్యూస్) :**పట్టణంలోని అరోమా కాఫీ షాప్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని రెవిన్యూ శాఖ మంత్రి సోదరుడు రాష్ట్ర నాయకులు పొంగిలేటి ప్రసాద్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. తీవ్ర ఎండల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, ప్రతిరోజు మధ్యాహ్నం పూట ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. మొదటి రోజు మజ్జిగ దాతగా మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు చల్లని పానీయాలు అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నదని తెలిపారు. ప్రజలకు ఉపశమనం కలిగించే కార్యక్రమాన్ని ప్రతిరోజు కొనసాగించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, తక్కెలపాటి ప్రసాద్, పోట్రు అర్జున్ రావు, యాసా శ్రీకాంత్, 16వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దేవాదాయ శాఖ చైర్మన్ ధారా రంగ, లక్ష్మీపురం సర్పం చ్ రవీంద ర్, కేసర శ్రీనివాస్ రెడ్డి, బైర్ల కాంతారావు, పుల్లా చారి, తోట సుబ్బా రావు, పొన్నూరు వెంకటేశ్వరరావు, శీలం కృష్ణారెడ్డి, ధారావత్ రవి, ధారావత్ వాసు, మాజీ వార్డు సభ్యులు అఫ్రోజ్, దారావత్ రవికు మార్, నల్లగట్ల పుల్లయ్య, రేపాకుల రామకృష్ణ, ఉబ్బన కరుణాకర్, గడ్డం బాజీ, రెహమత్, హనుమ ంతు తదితర కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.

# అలియాబాద్‌లో చలివేంద్రం ప్రారంభం

**• విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ చేసిన సర్పంచ్ సనత్..**

**• ముఖ్య అతిథిగా ఎస్సై పవన్**






**పరకాల రూరల్, మే 3 (పిసీడబ్ల్యూ న్యూస్):** పరకాల మండలం అలియాబాద్ గ్రామంలో గ్రామ ప్రజలు, బాటసారుల సౌకర్యార్థం శాతరాసి సుధాకర్ రావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్ ఆధ్వర్యంలో పరకాల ఎస్సై పవన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. సర్పంచ్ సనత్ కుమార్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. వేసవి కాలంలో పాఠశాలలు లేక విద్యార్థులు ఈతలకు పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారని , మొబైల్ ఫోన్లకు అలవాటు పడకుండా క్రీడలపై ఆసక్తి పెంచేందుకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతిరోజూ విద్యార్థులతో కలిసి తాను కూడా మైదానంలో పాల్గొంటానని పేర్కొన్నారు.అలియాబాద్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, గ్రామ ప్రజల సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తామని సర్పంచ్ తెలిపారు.ఇందులో గ్రామ వార్డు మెంబర్స్, పెద్ద మనుషులు, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యునిగా మామిళ్ళ సురేష్ నియామకం



**హనుమకొండ, మే 3 (పిసీడబ్ల్యూ న్యూస్):** జిల్లా కాంగ్రెస్ కమిటీలో నూతన నియామకాలు జరిగాయి. హనుమకొండ 31వ డివిజన్ (న్యూ శాయంపేట) కు చెందిన సీనియర్ నాయకులు మామిళ్ళ సురేష్ ను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యునిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది.గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సురేష్ సేవలను గుర్తించిన జిల్లా నాయకత్వం ఆయనకు ఈ కీలక బాధ్యతను అప్పగించింది.నమ్మకానికి దక్కిన గుర్తింపు, పార్టీ పట్ల విధేయతగా ఉంటూ, కార్యకర్తలకు అండగా ఉంటున్నందుకు గాను ఈ పదవి దక్కినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మామిళ్ళ సురేష్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు, ముఖ్య నాయకులకు, తన వెన్నంటి ఉన్న 31వ డివిజన్ కార్యకర్తలకు మామిళ్ళ సురేష్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మామిళ్ళ సురేష్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎంపికవ్వడం పట్ల 31వ డివిజన్ నాయకులు, న్యూ శాయంపేట ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నియామకం పట్ల పలువురు నాయకులు ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణ ప్రభుత్వ లక్ష్యం




**హైదరాబాద్, మే 03(పిసిడబ్ల్యూ న్యూస్):** శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు నూతనంగా డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఆర్. లక్ష్మణ్ యాదవ్, పుల్ల నారాయణస్వామి, తోలుపునూరి కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన యూసుబ్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**• త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**



**కల్లూరు, మే 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలోని వెల్లంకి ఎస్టేట్‌కు చెందిన ఎస్‌కే యూసుబ్ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్ రావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. యూసుబ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చిరుమర్తి



**రామన్నపేట మే3(పీసీడబ్ల్యూన్యూస్):**రామన్నపేట మండలం సరినేనిగూడెం గ్రామానికి చెందిన నీల నరసింహ కుమారుడి వివాహానికి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పోష బోయిన మల్లేశం జిల్లా నాయకులు వెల్లంకి మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ వెల్లంకి సర్పంచ్ ఇడం రాదా శ్రీనివాస్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి అమర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గర్దాస్ విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలన నగరం



**రామన్నపేట మే3(పీసీడబ్ల్యూన్యూస్):**జేపీ గార్డెన్స్ లో జరిగిన ఇంద్రపాలనగరానికి చెందిన కూరెళ్ల నర్సింహా-మాధవిగార్ల కూతురు సాత్విక-రంజత్ కుమార్ ల వివాహం లో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియచేసిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ఈ కార్యక్రమంలోఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి,రాస వెంకటేష్, రాజన్నగారి రమేష్, మంటి సరోజన రమేష్ మాజీ ఎంపీటీసీ ,గర్ధాస్ కరుణాకర్ మాజీ ఏఎంసి డైరెక్టర్ ,సిరిపంగి గణేష్,ఈర్లపల్లి రమేష్,మంటి శంకర్, తంగేడిపల్లి ఎల్లయ్య,ఎడమ నర్సింహా తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్



**నర్సింహులపేట మే3(పీసీడబ్ల్యూన్యూస్):**నర్సింహులపేట మండలం వంతడుపుల గ్రామానికి చెందిన బానోత్ వెంకన్న నాయక్- భద్రమ్మ గార్ల కుమారుడు రాజశేఖర్ -అనసూయ వివాహ వేడుకలో ఆదివారం పాల్గొని నూతన వధూవరులను డోర్నకల్ మాజీ శాసనసభ్యులను రెడ్యానాయక్ ఆశీర్వదించారు. డిఎస్ రాంసింగ్ నాయక్, సుధీర్ రెడ్డి, సర్పంచ్ వంశీ నాయక్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**నెక్కొండ మే3(పీసీడబ్ల్యూన్యూస్):**వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన పలుసం సరోజన నర్సయ్య (రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్) దంపతుల కుమారుడు ముని సతీష్-మౌనిక ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి పలుసం రాములు పలుసం పూర్ణచందర్ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# మోదీ సభ విజయవంతానికి బీజేపీ శ్రేణులకు బండి సంజయ్ పిలుపు

**కరీంనగర్,మే3(పీసీడబ్ల్యూన్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న హైదరాబాద్ పర్యటనకు రానున్న నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభను కనీవినీ ఎరగని రీతిలో విజయవంతం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా సభకు తరలిరావాలని, ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో జన సమీకరణ చేయాలని సూచించారు.ఆదివారం కరీంనగర్‌లోని గాయత్రీనగర్‌లో బీజేపీ జిల్లా కార్యాలయ నూతన భవన నిర్మాణానికి బండి సంజయ్ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నేతలు భారీగా హాజరయ్యారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో గాయత్రి బ్యాంకెట్ హాల్‌లో జరిగిన సమావేశంలో



ఆయన పాల్గొని, ఈనెల 10న జరిగే మోదీ సభ విజయవంతం, జన సమీకరణపై నేతలతో చర్చించారు. ప్రతి నాయకుడు తన అనుచరులు, బృందంతో సభకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.మోదీ సభకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, వార్డులు, మండలాల్లో వాల్ రైటింగ్ చేపట్టాలని, సభకు వచ్చే వారికి రవాణా, భోజన సౌకర్యాలు కల్పించాలని బండి సంజయ్ ఆదేశించారు. సభ విజయంతో రాష్ట్రంలో బీజేపీ బలం



ప్రజల్లో ప్రతిఫలించేలా సంకేతాలు పంపాలని అన్నారు.ఇక జ్యోతినగర్‌లోని కేడీఆర్ పార్కు వద్ద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.16 లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ రావుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్...

**గన్నేరువరం,మే03(పీసీడబ్ల్యూ న్యూస్):** గన్నేరువరం మండలంగునుకుల కొండాపూర్ గ్రామంలో సర్పంచ్ అజయ్ వర్మ , పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో, సుప్రీమ్ హాస్పిటల్స్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం రోజున కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివ కుమార్ విచ్చేసి ప్రారంభించారు.లండన్‌లో శిక్షణ పొందిన డా. తిరుపతి సిరవేణి ఆధ్వర్యంలో గ్రామస్తులకు బిపి, షుగర్, సి బి పి, ఈ సి జి, పరీక్షలు ఉచితంగా చేసి, మందులు అందజేశారు. ఉదయం ప్రారంభమైన ఈ ఉచిత వైద్య శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనజిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ మాట్లాడుతూ "న్యాయం, ఆరోగ్యం రెండూ ప్రతి పౌరుడి హక్కు. అని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలనీ, ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిన. నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ అజయ్ వర్మ మాట్లాడుతూ, " గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తమ పాలకవర్గం కృషి చేయాలనే ఆలోచనతో ఉందని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి మా ప్రథమ ప్రాధాన్యత



ఉంటుందని, కరీంనగర్ వెళ్లలేని పేద ప్రజల కోసమే ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా జడ్జి శివకుమార్ ఈ ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించడం సంతోషకరంగా, గర్వంగా ఉందన్నారు. ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన సుప్రీమ్ హాస్పిటల్స్ యాజమాన్యానికి, డాక్టర్ తిరుపతి కి ధన్యవాదాలు" తెలియజేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఈ



కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ లింగంపల్లి నాగరాజు, న్యాయవాదులు తుమ్మ ప్రభాకర్ జేరిపోతుల మహేందర్ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హిందువుల ఐక్యతే దేశానికి శ్రీరామ రక్ష...

- ఆర్ఎస్ఎస్ విభాగ్ సంపర్క ప్రముఖ్ కుమ్మరి కుంట సుధాకర్ జీ.




**తిమ్మాపూర్,మే03(పీసీడబ్ల్యూ న్యూస్):**శ్రీ వెంకటేశ్వర స్వామి హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో సుందరగిరి ఉప మండల కేంద్రంలో ఘనంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ విభాగ్ సంపర్క ప్రముఖ్ కుమ్మరికుంట సుధాకర్ జీ మాట్లాడుతూ, హిందువుల ఐక్యతే దేశానికి శ్రీరామ రక్ష అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు హిందూ ఐక్యత అత్యంత అవసరమని, కుల మరియు ప్రాంతీయ విభేదాలను పక్కనపెట్టి హిందువులందరూ ఒకే కుటుంబంగా భావించాలని పిలుపునిచ్చారు.రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపనకు వంద సంవత్సరాలు పూర్తయ్యాయని, ఈ కాలంలో సంఘం దేశహితం, మాతృభూమి సేవ, హిందూ సంస్కృతి పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసిందన్నారు. వందేళ్ల ఉత్సవాల భాగంగా 'పంచ పరివర్తన్' దిశగా సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.సామాజిక సమరసత, సంస్కృతి-సాంప్రదాయాల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, కుటుంబ ప్రబోధన్, పౌర నియమావళి వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా సంఘం కృషి చేస్తోందన్నారు. ముఖ్య అతిథి శ్రీ శ్రీ శ్రీ సనకసనంద మహారాజ్ స్వామి, మహిళా వక్త తిప్పర్తి రమాదేవి లు మాట్లాడుతూ, సనాతన ధర్మం, సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. దేశభక్తి, జాతీయ భావం పెంపొందించుకోవాలని, విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు సమాజంలో హిందూ ఐక్యత అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షులు శ్రీ రామోజు రాజ్ కుమార్ ,సమితి బాధ్యులు,సుందరగిరి గ్రామ సర్పంచ్ జంగా శిరీష రమణ రెడ్డి వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## తొర్రూర్ బస్ డిపోలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షునిగా ధర్మారపు దర్గయ్య( ఎడిసి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు
- ముఖ్య అతిథిగా వరంగల్ రీజినల్ గూడెల్లి దేవేందర్ అధ్యక్షతన ఎన్నికల నిర్వహించారు.





**తొర్రూరు ప్రతినిధి,మే03(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ రీజనల్ లోని తొర్రూర్ టీజీఎస్ఆర్టిసి బస్సు డిపో ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు.ఈ కమిటీకి ముఖ్య అతిథిగా వరంగల్ రీజినల్ అధ్యక్షులు గూడెల్లి దేవేందర్ అధ్యక్షతన వారి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగిందని తొర్రూర్ టీజీఎస్ ఆర్టీసీ బస్ డిపో ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షునిగా ధర్మారం దర్గయ్య (ఈ డి సి) ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. కార్యదర్శిగా రమణ(కండక్టర్) ను ఎన్నుకున్నారు.23 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దర్గయ్య ప్రసంగిస్తూ ఆర్టీసీ డిపోలో సుమారుగా 100 మంది ఎస్సీ, ఎస్టి వెల్ఫేర్ సభ్యులు ఉన్నారని అన్నారు. రాష్ట్రం ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు టీజీఎస్.ఆర్టిసిలో ట్రావెల్స్ చేయడానికి మనకు మంచి అవకాశం ఉందని ఎలాంటి సమస్యలు ఉన్నా ఎస్సీ, ఎస్టీ కమిటీ తరఫున మేనేజర్ కు విన్నవించుకొని సమస్యలు పరిష్కారం చేసే దిశగా నడుచుకుంటానని వారు చెప్పారు. అనంతరం కార్యదర్శి ప్రసంగిస్తూ ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు అందరూ కలిసికట్టుగా ఐక్యంగా ఉండాలని వారు కోరారు. ఈ కమిటీ రీజినల్ కమిటీ వరంగల్ అధ్యక్షులు ఆధ్వర్యంలో చేయటం జరిగిందని విన్నవించారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సిహెచ్ వెంకన్న, కార్యదర్శి ఎం రామన్న ,అధ్యక్షులు డి దుర్గయ్య ,ఏ డి సి,వర్కింగ్ అధ్యక్షులు బి నరసింహ.(డ్రైవర్), ఎస్ ,పద్మ. (కండక్టర్). ఏం ,మమత. (కండక్టర్). డి ప్రశాంత్, (కండక్టర్). కార్యదర్శి ఎం, రామన్న .(కండక్టర్). అడిషనల్ కార్యదర్శి ఎం సురేష్(కండక్టర్),జై భాను ప్రసాద్.(కండక్టర్). ఏ మల్లయ్య.(కండక్టర్). ట్రెజరర్ గా ఐ .కిరణ్.(కండక్టర్). చైర్మన్ జి యాకయ్య. (ఏ డి సి). సిహెచ్ వెంకన్న (కండక్టర్). మిగతా కొన్ని పోస్టులను ఎంపిక చేశారు. ఈ ఎంపికను తొర్రూర్ లోని అతిథి గృహంలో ఎన్నికలను నిర్వహించారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వచ్చిన అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏ విషయమైనా అధ్యక్ష, కార్యదర్శులు విచారణలు జరుపుతామని ఏమున్నా వారి ఆదేశాల మేరకే మేము నడుచుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఎంపిక మాకు ఎంతో ఆనందం ఇచ్చిందని మాకు ఇచ్చిన సమయాన్ని వృధా చేయకుండా అన్ని రకాలుగా సమస్యలకు పరిష్కారం దిశగా మేము నడుచుకుంటామని హామీ ఇస్తున్నామని అన్నారు.

# ఖాకీ అహంకారంపై..
# శ్రమజీవి 'కత్తి' సాము!

### అధికార మదానికి సస్పెన్షన్ సమాధానం
### ఆత్మగౌరవ పోరాటానికి ఐక్యతే ఆయుధం

సమాజం అనే రథం సాఫీగా సాగాలంటే వృత్తి కులాలే దానికి మూలమైన చక్రాలు. నాగరికత ముసుగులో ఉన్న ఆధునిక ప్రపంచానికి ప్రతి ఉదయం తన శ్రమతో ఊపిరి పోసేది ఈ మట్టి బిడ్డలే. రక్తాన్ని చెమటగా మార్చి సమాజానికి సేవ చేసే శ్రమజీవి లేనిదే ఏ వ్యవస్థా ముందుకు కదలదు.

కానీ, దురదృష్టవశాత్తు కొందరికి అధికారం నెత్తికెక్కితే మనుషులు మృగాలవుతారని కరీంనగర్ ఘటన మరోసారి నిరూపించింది. నాయీ బ్రాహ్మణుడి అద్దంలో తన రూపాన్ని చూసుకునే అధికారికి, అదే అద్దం వెనుక ఉన్న మనిషి మనసు, ఆత్మగౌరవం కనిపించకపోవడం సామాజిక దౌర్భాగ్యం.

#### 'అన్నా' అన్న పిలుపు నేరమా?

భారతీయ సంస్కృతిలో 'అన్న' అనే పిలుపు ఒక బంధం, ఒక గౌరవం, ఒక ఆత్మీయత. అపరిచితుడిని కూడా తనవాడిగా చేసుకునే అద్భుతమైన సంబోధన అది. కానీ, కరీంనగర్‌లో ఒక ఎస్సై, తనను 'అన్నా' అని పిలిచినందుకు ఒక సెలూన్ నిర్వాహకుడిపై భౌతిక దాడికి దిగడం ఆయన మానసిక దారిద్ర్యానికి నిదర్శనం.

"కులం చూసి కుంచించుకుపోయేవాడు కుసంస్కారి.. శ్రమను చూసి శిరస్సు వంచేవాడే సంస్కారి." ఖాకీ చొక్కా వేసుకోగానే రాజ్యాంగం కల్పించిన బాధ్యతను మరిచి, రాచరికపు అహంకారాన్ని ప్రదర్శించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. అధికారం అహంకారాన్ని ఇస్తుందేమో కానీ, మనిషిని మనిషిగా గుర్తించే సంస్కారాన్ని ఇవ్వలేదని ఈ ఘటన స్పష్టం చేసింది.

#### నాయీ బ్రాహ్మణులు: మంగళ ప్రదాతలు - అన్యాయానికి వ్యతిరేకులు




నాయీ బ్రాహ్మణులు అంటే కేవలం కత్తీ, కత్తెర పట్టిన వారు మాత్రమే కాదు. పుట్టుక నుండి చావు వరకు ప్రతి శుభకార్యంలో మంగళ వాయిద్యాలతో పవిత్రతను నింపే 'మంగళ ప్రదాతలు'. సమాజానికి ఆరోగ్యాన్ని, అందాన్ని ప్రసాదించే శిల్పులు. వారి చేతిలో కత్తి రూపాన్ని తీర్చిదిద్దడమే కాదు, అన్యాయం జరిగినప్పుడు అహంకారం కోరలు పీకడానికి కూడా సిద్ధంగా ఉంటుందని పడాల రాములు లాంటి బిడ్డలు నిరూపించారు.

#### ఐక్యతే అసలైన ఆయుధం

ఈ పోరాటంలో బాధితుడికి అండగా నిలిచి, సదరు అధికారి సస్పెండ్ అయ్యే వరకు విశ్రమించని నాయీ బ్రాహ్మణ సోదరుల ఐక్యత అభినందనీయం. "ఒక్కడిపై దాడి - వృత్తి కులాలందరిపై దాడి" అనే నినాదం నేడు ఊపిరి పోసుకుంది. చట్టాలు రక్షణ ఇస్తాయి.. కానీ చైతన్యం గౌరవాన్ని ఇస్తుంది. అధికారం శాశ్వతం కాదు.. కానీ శ్రమతో సంపాదించుకున్న ఆత్మగౌరవం అమరం.

#### శ్రమజీవి సలాం కొట్టే రోజులు పోయాయి!


వృత్తి కులాల చెమట చుక్కలతోనే ఈ దేశ చరిత్ర లిఖించబడింది. ఆ చెమట వాసనను అసహ్యించుకునే ఏ శక్తీ వర్ధిల్లలేదు. అధికారం తలకెక్కితే సస్పెన్షన్ వస్తుంది, కానీ శ్రమ పట్ల గౌరవం ఉంటేనే సమాజం నీకు నీరాజనం పడుతుంది. సామాజిక వివక్ష అనే చీకటిని చీల్చుకుంటూ వృత్తి కులాల ఆత్మగౌరవ జెండా కరీంనగర్ గడ్డ మీద రెపరెపలాడింది. ఈ చైతన్యం ఇక్కడితో ఆగకూడదు. "చెమట చిందించే చేతులు ఏకమైతే.. ఏ అహంకారమైనా మోకరిల్లాల్సిందే!" అణచివేత ఎక్కడ ఉన్నా తిరుగుబాటు తప్పదని, ఆత్మగౌరవ పోరాటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని చాటిచెప్పిన నాయీ బ్రాహ్మణ ముద్దుబిడ్డలకు, సామాజిక శక్తులకు విప్లవ వందనాలు!



తేదీ: 03.05.2026 విశ్వ జంపాల, న్యాయవాది విశ్వ సమాజం వ్యవస్థాపకులు మొబైల్: 7793968907

## బౌద్ధమే ఈ దేశానికి మార్గం
### - కోలా శ్యామ్ , అధ్యక్షుడు, భారత బౌద్ధ సమాజం






**బెల్లంపల్లి మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని సుబ్బారావుపల్లి జైభీమ్ భవన్ లో అధ్యయన సదస్సును వేల్పుల కనకయ్య పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక ప్రధాన సలహాదారుల అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారత బౌద్ధ సమాజం కోలా శ్యామ్ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా చారిత్రక బౌద్ధము, సామాజిక విశ్లేషకుణ అంశంపై మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా కోలా శ్యామ్ మాట్లాడుతూ చారిత్రక బౌద్ధ క్రీస్తుపూర్వం 5వ శతాబ్దంలో ప్రాచీన భారతదేశంలోని మగధ రాజ్యంలో సిద్ధార్థ గౌతముని (బుద్ధుడు) బోధనల నుండి ఉద్భవించిందాని, ఇది సమానత్వం, నైతికత, దుఃఖ విముక్తిని బోధిస్తూ, అశోకుడి కాలంలో విస్తరించి, నేడు ప్రపంచవ్యాప్తంగా 500 మిలియన్లకు పైగా ప్రజలు ఆచరిస్తున్న ప్రధాన మతాలలో ఒకటిగా నిలిచిందాని అన్నారు . సిద్ధార్థ గౌతముడు క్రీ.పూ 6వ శతాబ్దంలో నేపాల్‌లోని లుంబినిలో జన్మించి, జ్ఞానోదయం పొంది 'బుద్ధుడు' అయ్యాడని, బౌద్ధంలో బాధలను అర్థం చేసుకోవడం, జ్ఞానాన్ని పెంపొందించడం, నైతిక జీవితాన్ని గడపడంపై దృష్టి సాధించిందాని, 3వ శతాబ్దంలో మౌర్య చక్రవర్తి అశోకుని ఆధ్వర్యంలో బౌద్ధమతం భారతదేశంనికి, అంతర్జాతీయంగా వేగంగా వ్యాపించిందాని, ఇది భారత ఉపఖండంలో సామాజిక సమానత్వ భావనలను బలోపేతం చేసి గొప్ప పర్యాటక, సాంస్కృతిక వారసత్వాన్ని వదిలివేసి కీలకమైన చారిత్రక ఘటనలుగా మారాయని అన్నారు. మొదటి బౌద్ధ సంగీతి బుద్ధుని నిర్యాణం (మరణం) తర్వాత, రాజగృహలో అజాతశత్రువు రాజు ఆధ్వర్యంలో మొదటి సమావేశం జరిగింది. మహాయాన & హీనయాన: బౌద్ధ సమాజం మహాసాంఘిక, స్థవిరావద అనే రెండు ప్రధాన విభాగాలుగా విడిపోయింది, ఇవి తర్వాత మహాయాన,






థెరవాడగా రూపాంతరం చెందాయి. చారిత్రక బౌద్ధమతం అహింస, కరుణ, మధ్యేమార్గం వంటి సూత్రాల ద్వారా ప్రపంచ నాగరికతపై చెరగని ముద్ర వేసిందాని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, గౌతమ బుద్ధుని సిద్ధాంతాలైన సమత, మమత, సమానత్వం ద్వారానే బలహీన వర్గాలకు విముక్తి సాధ్యమని నమ్మి, 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో అంబేద్కర్ తన లక్షలాది అనుచరులతో కలిసి బౌద్ధమతాన్ని స్వీకరించారని, ఆయన రచించిన "బుద్ధుడు, అతని ధమ్మ" గ్రంథం, నవయాన బౌద్ధానికి మూలస్తంభం, ఇది కుల నిర్మూలన, సామాజిక న్యాయంపై బుద్ధుని బోధనలను ఆధునిక దృక్పథంతో వివరించారని అన్నారు. అంబేద్కర్ కుల వ్యవస్థను, పురుషాధిక్యతతో ద్వేషాన్ని వ్యాపింపజేస్తూ, స్త్రీల ప్రయోజనాలను అణచివేస్తున్న దాని మత గ్రంథాలను విమర్శించారు. కులాంతర భోజనాలు, కులాంతర వివాహాలు కుల వ్యవస్థను నిర్మూలించడానికి సరిపోవని, కానీ "కుల వ్యవస్థను విచ్ఛిన్నం చేసే అసలైన పద్ధతి... కులానికి ఆధారమైన మతపరమైన భావనలను నాశనం చేయడమే అని ఆయన వాదించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పూలే పెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక గౌరవ అధ్యక్షులు జీ.ఎ జ్యోతి కూమార్, అధ్యక్షులు గోడిసెల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్, ఉపాధ్యక్షులు అక్కు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడిసెల సామి, కార్యదర్శి దుబాసి రవి , కార్యదర్శి, ప్రచార కార్యదర్శులు రవి రాజ్, ఉంద్రాల రవి, యం 21 సంఘ ప్రతినిధులు కమల్, బక్కయ్య, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధి యం. ప్రేమ్ కూమార్, ఆదివాసి సంఘ ప్రతినిధులు కోమ్ము బాపు, సామాజిక చైతన్య వేదిక ప్రతినిధి మద్దివెని చిన్న భీమయ్య, బుద్ధిస్టు సంఘ ప్రతినిధి రజీని పాలేకర్, ఎరుకల సంఘ ప్రతినిధి యు ఎల్లయ్య, పూలే పెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక సభ్యులు రసకొండ ప్రసాద్. మంజుల. సుంక లక్ష్మన్. మాడుగుల శంకర్. తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధవటంలో వైభవంగా గంగమ్మ జాతర... పోటెత్తిన భక్తులు



**సిద్ధవటం మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రమైన సిద్ధవటంలో గ్రామదేవత గంగమ్మ అమ్మవారి వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. పసుపు కుంకుమలతో అలంకరించిన అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు వాయిద్యాలు, పూనకాలతో గ్రామంలో కోలాహలం నెలకొంది.గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఎడ్ల బండ్లు, పోతురాజు విగ్రహంతో నిర్వహించిన ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. గ్రామస్తులు, మహిళలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## పులివెందల ఆర్టీసీ డిపోలో ఆన్ కాల్ డ్రైవర్ల నియామకం
### - డిపో మేనేజర్ ప్రేమ్ కుమార్



**పులివెందల మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్టీసీ పులివెందల డిపోలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు 'ఆన్ కాల్ డ్రైవర్ల' భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.సంస్థ అవసరాల దృష్ట్యా ఈ నియామకాలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు కనీసం 21 ఏళ్ల వయస్సు నిండి ఉండిహెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది కనీసం 18 నెలల అనుభవం తప్పనిసరి ఉండాలన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు మే 7, 2026 (గురువారం) లోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందని పులివెందల ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం నందుమరిన్ని వివరాలకు సంప్రదించాలన్నారు.ఈ నియామక ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 7382867972 నెంబర్‌ను సంప్రదించాలని డీఎం సూచించారు.

## శివాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల



**ప్రొద్దుటూరు మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):-** ప్రొద్దుటూరు నియోజకవర్గం రాజుపాలెం మండలం కొర్రపాడు గ్రామం నందు శివాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి. మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, యువనాయకులు నంద్యాల కొండారెడ్డి. శివాలయం విగ్రహ ప్రతిష్టకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించిన యువనాయకులు నంద్యాల కొండారెడ్డి. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, లేపాక్షి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి మ్యాంగో డిజిటల్ ప్రింటింగ్

**కడప మే 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** కడప నగరం కోపరేటివ్ కాలనీలోని అందుబాటులోకి మ్యాంగో డిజిటల్ ప్రింటింగ్ వచ్చిందని యజమాని సుబ్బరాయుడు తెలిపాడు.ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మన్సూర్ ఆలీ ఖాన్ జనసేన పార్టీ నాయకుడు జీ వి రమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యధికమైన ప్రింటింగ్ మిషన్ ఉండడం సంతోషమని 24 అవర్స్ నగర వాసులు అందుబాటులో ఉంటాయని ఫ్లెక్సీ ప్రింటింగ్ ఫోటో ఫ్రేమ్స్ రోల్ అఫ్ స్టాండ్ విస్టింగ్ కార్డ్స్ హోల్డింగ్స్ లైటింగ్ బోర్డ్స్ పాంప్లెట్స్ అనేక రకాల ప్రింటింగులు ఉంటాయని ప్రజలు వినియోగించుకొని ఆదరించాలని కోరుకోరారు ఈ కార్యక్రమంలో వినయ్ లక్ష్మీ నరసింహ స్నేహితులు తదితరులు పాల్గొన్నారు



# బెంగాల్‌లోని 285 పోలింగ్ కేంద్రాల్లో 21న రీపోలింగ్, 24న కౌంటింగ్..

**కోల్‌కతా:** అసెంబ్లీ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో సోమవారం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించనున్నారు. అయితే పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్తా నియోజకవర్గంలో మే 21న రీపోలింగ్ జరుగనున్నది. ఈ నేపథ్యంలో అక్కడి ఫలితాన్ని మే 24న ప్రకటిస్తారు. ఫాల్తా నియోజకవర్గంలోని 285 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సందర్భంగా పలు అవకతవకలు జరిగినట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ధారించింది. బ్యాలెట్ యూనిట్లపై ఉన్న బటన్లపై నల్ల టేపులు అంటించి ఓ అభ్యర్థికి ఓటు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించింది. అలాగే ఒక నిర్దిష్ట అభ్యర్థికి ఓటు వేసిన వారిని గుర్తించడానికి బ్యాలెట్ యూనిట్ల బటన్లపై




పెర్ఫ్యూమ్, సిరా పూసినట్లు నివేదికలో పేర్కొంది.కాగా, పలు పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో ప్రసారంలో సుదీర్ఘ అంతరాలు ఏర్పడినట్లు ఈసీ ధృవీకరించింది. అత్యధిక ఓటింగ్ జరిగే సమయాల్లో స్టోరేజ్ చిప్‌లు ఖాళీగా ఉండటం, సంబంధం లేని ఎన్నికల ఫుటేజీని కలిగి ఉండటంతో పాటు ప్రసార అంతరాలను గుర్తించింది. ఈ నేపథ్యంలో ఓటర్లను ఓటు వేయకుండా నిరోధించడానికి లేదా బెదిరింపులు, భయపెట్టే ఎత్తుగడలతోపాటు పోలింగ్ కేంద్రాలను బలవంతంగా స్వాధీనం, బూత్ క్యాప్చరింగ్‌లకు పాల్పడినట్లు, భారీగా నకిలీ ఓటింగ్ జరిగినట్లు ఈసీ ఆరోపించింది.మరోవైపు ఈ అవకతవకల గుర్తింపుతో పాటు రీపోలింగ్ డిమాండ్ల నేపథ్యంలో ఫాల్తా నియోజకవర్గంలోని 285 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓటింగ్‌ను ఈసీ రద్దు చేసింది. ఆ పోలింగ్ కేంద్రాల్లో మే 21న రీపోలింగ్ నిర్వహించాలని, మే 24న కౌంటింగ్ నిర్వహించి ఫలితాన్ని ప్రకటించాలని బెంగాల్ ఈసీ ఆదేశించింది.

# సొంత పొలంలో పుచ్చకాయలు కోసిన బాలుడు.. హత్య చేసిన కౌలుదారులు




**లక్నో:** ఒక బాలుడు తన కుటుంబానికి చెందిన పొలంలో పుచ్చకాయలు కోశాడు. అయితే ఆ పొలాన్ని కౌలుకు తీసుకున్న వ్యక్తులు కత్తితో పొడిచి అతడ్ని హత్య చేశారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పోలీసులను మోహరించారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాలో ఈ దారుణం జరిగింది. జగ్నేర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని సోనిఖేడా గ్రామానికి చెందిన ఒక కుటుంబం తమ పొలాన్ని కౌలుకు ఇచ్చారు.కాగా, మే 1న ఆ కుటుంబానికి చెందిన 13 ఏళ్ల అవనీష్ కుష్వాహా సొంత పొలానికి వెళ్లాడు. ఆ పొలంలోని పుచ్చ కాయలను కోశాడు. ఆగ్రహించిన కౌలుదారులు కత్తితో పొడిచి ఆ బాలుడ్ని చంపారు. సోదరుడి కోసం వెతుకుతూ వచ్చిన సోదరి అతడి మృతదేహాన్ని చూసి షాక్ అయ్యింది. తన కుటుంబానికి ఈ విషయం చెప్పింది. ఆ కుటుంబం ఆగ్రహంతో రగిలిపోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. నిందితులైన రియాజుద్దీన్, షిరాజుద్దీన్‌ను శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పలు పోలీస్ స్టేషన్ల నుంచి అదనపు పోలీస్ బలగాలను వెల్లడించారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో బస్సు బోల్తా.. 26 మందికి గాయాలు.. డ్రైవర్‌కు గుండెపోటే కారణం..



**హిమాచల్ ప్రదేశ్ :** హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రాలో ఆదివారం బస్సు ప్రమాదం జరిగింది. బస్సు బోల్తా పడిన ఘటనలో 26 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లాలో జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో చంబా నుంచి ఉనా వెళ్తోంది. ఈ క్రమంలో నుర్పూర్ సమీపంలోని నియాజ్‌పూర్ వద్ద బస్సు బోల్తా పడింది.ఈ ఘటనలో బస్సులోని ప్రయాణికుల్లో 26 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. బస్సు డ్రైవర్ గుండె పోటుకు గురికావడం, ఈ సమయంలో బస్సును నియంత్రించలేకపోవడం వల్లే బోల్తాపడి ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా. బస్సు అదుపుతప్పుతున్న సమయంలోనే కొందరు ప్రయాణికులు గమనించి తమను తాము రక్షించుకునేందుకు అప్రమత్తమయ్యారు. బస్సు బోల్తా పడినే వెంటనే స్థానికులు స్పందించారు. అధికారులకు వెంటనే సమాచారం అందించారు. వెంటనే అధికారులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికుల్ని బయటకు తీశారు.గాయపడ్డవారిని నుర్పూంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స అందుతోంది. ఈ 26 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని మెరుగైన చికిత్సకోసం టాండా మెడికల్ కాలేజీకి పంపించినట్లు వైద్యులు తెలిపారు. మిగతా వారికి గాయాలైనప్పటికీ, ప్రాణ ~ాయం లేదని తెలిపారు.

# జబల్‌పూర్ బోటు ప్రమాదం.. మరో రెండు మృతదేహాలు లభ్యం.. 13కి చేరిన మృతుల సంఖ్య

**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్ జిల్లా బర్గీ డ్యామ్ జరిగిన క్రూయిజ్ బోటు ప్రమాదంలో మృతుల సంఖ్య 13కి పెరిగింది. ఆదివారం మరో రెండు మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. వారిలో ఐదేళ్ల బాలుడు, 50 ఏళ్ల వ్యక్తి ఉన్నారు. ఐదేళ్ల బాలుడు మయూరామ్ 50 ఏళ్ల కామరాజ్ మేనమామగా గుర్తించారు. ఈ ఇద్దరితో కలిసి బోటు ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 13కు చేరినట్లయ్యింది. మరో ఇద్దరి ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది.
మూడు రోజుల క్రితం అంటే ఏప్రిల్ 30న సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. అదేరోజు




స్థానికులు, సహాయక బృందాలు కలిసి 28 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మరో 9 మృతదేహాలను వెలికి తీశారు. ఆ తర్వాత రోజు మరో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇవాళ మరో రెండు మృతదేహాలు నీటిపై తేలుతుండటాన్ని రెస్క్యూ టీమ్స్ గుర్తించి బయటికి తీసుకొచ్చాయి. ఈ ఇద్దరితో కలిసి మృతుల సంఖ్య 13కు పెరిగింది. అయితే సీసీ కెమెరా ఫుటేజీని బట్టి చూస్తే ప్రమాదానికి ముందు మొత్తం 43 మంది ప్రయాణికులు బోటు ఎక్కారు. వారిలో 28 మంది సురక్షితంగా ప్రాణాలతో బయట పడగా.. 13 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. అంటే మొత్తం 43 మంది లెక్కు వచ్చారు.

# పూనేలో మరో దారుణం.. మూడేళ్ల బాలుడిపై హత్యాచారం.. నిందితుడు మైనర్

**మహారాష్ట్ర :** మహారాష్ట్రలోని పూనేలో దారుణం జరిగింది. మూడేళ్ల బాలుడిపై మైనర్ హత్యాచారానికి పాల్పడ్డాడు. బాలుడిపై అత్యాచారం చేసిన అనంతరం నిందితుడు, చిన్నారిని చంపేశాడు. ఈ ఘటన మే 1,శుక్రవారం జరిగింది. పూనే పరిధిలో ఒకే రోజు జరిగిన రెండో చిన్నారి హత్యాచార ఘటన ఇది. బాలుడి హత్యాచారానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. పూనేలో ఉంటున్న ఒక కుటుంబానికి చెందిన మూడేళ్ల బాలుడిని, శుక్రవారం వారి ఇంటికి దగ్గరలో ఉండే బిహార్‌కు చెందిన ఒక మైనర్ తీసుకెళ్లాడు. చాక్లెట్లు ఇస్తానని చెప్పి నమ్మించి, బాలుడిని తను నివాసం ఉండే ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ



బాలుడిపై మైనర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే, విషయం ఎవరికైనా తెలిస్తే ఇబ్బంది అవుతుందని చిన్నారిని పొడిచి చంపాడు. తర్వాత బాలుడి మృతదేహాన్ని ఒక సూట్‌కేసులో ఉంచి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తమ కొడుకు కనిపించకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. ఇదే సమయంలో నిందితుడి ఇంటికి కూడా వెళ్లి ఆరా తీశారు. కానీ, అతడు వారిని తప్పుదోవ పట్టించాడు. దీంతో తల్లిదండ్రులు అక్కడి నుంచి వెతుక్కుంటూ వేరే చోటుకు వెళ్లిపోయారు. అయితే, ఎంత వెతికినా చిన్నారి బాలుడి ఆచూకీ కనిపించకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.వారి మిస్సింగ్ కేసు నమోదు చేసి బాలుడి కోసం వెతికారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ క్రమంలో వారి ఇంటి సమీపంలో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం సీసీ ఫుటేజ్ ఆధారంగా బిహార్‌కు చెందిన మైనర్ ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు గుర్తించారు. దీంతో నిందితుడి కోసం గాలించగా.. అతడు బిహార్ పారిపోయేందుకు ప్రయత్నిస్తూ రైల్వే స్టేషన్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా, నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిపై పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం కూడా పూనే పరిధిలోనే నాలుగేళ్ల చిన్నారిని 65 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసి, చంపేశాడు.

## ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ 2026 పరీక్ష.. 20 లక్షల మందికిపైగా హాజరు



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ -- 2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈరోజు మధ్యాహ్నం రెండ గంటలకు ప్రారంభమైన ఈ పరీక్ష సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 552 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాల్లో కలిపి సుమారు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారు.పరీక్ష నిర్వహణ కోసం ఎన్‌టీఏ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేసి ఆ తర్వాత వచ్చిన వారిని లోపలికి అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రెస్ కోడ్‌తోపాటు ఇతర నిబంధనలను కఠినంగా అమలు చేశారు. అడ్మిట్ కార్డు, ఫొటో, ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉన్నవారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు.
విద్యార్థులకు 1.45 గంటలకు ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు అందజేసి, రెండు గంటలకు పరీక్ష ప్రారంభించారు. పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## కేరళలో మారుతున్న అధికారం ఫలితాలకు ముందే సీఎం విజయన్ షాకింగ్ నిర్ణయం



**కేరళ :** కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన సోషల్ మీడియా ఖాతాలో చేసిన ఓ మార్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కేవలం ఒక్కరోజు ముందు ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన సోషల్ మీడియా (ఎక్స్, ఫేస్‌బుక్) బయోలో కీలక మార్పులు చేశారు. గతంలో తన బయోలో 'కేరళ ముఖ్యమంత్రి' అని ఉండగా.. దానిని తొలగించి ఇప్పుడు కేవలం 'పొలిట్ బ్యూరో సభ్యుడు, భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్)' అని మార్చుకున్నారు. ఫలితాలు రాకముందే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం అధికార మార్పిడికి సంకేతమా? లేక ఓటమిని అంగీకరించడమేనా? అనే చర్చలు రాజకీయ వర్గాల్లో మొదలయ్యాయి.ఎగ్జిట్ పోల్స్ అంచనాలు.. ఎల్డీఎఫ్‌కు షాక్?ఈసారి వెలువడిన దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ కేరళలో అధికార మార్పిడి జరుగుతుందని అంచనా వేశాయి. అధికార ఎల్డీఎఫ్ కూటమి వెనుకబడిందని.. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి స్పష్టమైన మెజారిటీ లభించే అవకాశం ఉందని సర్వేలు పేర్కొన్నాయి. ఈ అంచనాల నేపథ్యంలోనే ముఖ్యమంత్రి తన హోదాను సోషల్ మీడియా నుంచి తొలగించారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై పార్టీ వర్గాల నుంచి ఇంకా అధికారిక వివరణ రాలేదు.
ధర్మడమ్ స్థానంలో హోరాహోరీ పోరుపినరయి విజయన్ తన సొంత గడ్డ అయిన ధర్మడమ్ నియోజకవర్గం నుండి వరుసగా మూడోసారి విజయం సాధించాలని పట్టుదలతో ఉన్నారు. గతంలో 2016, 2021 ఎన్నికల్లో ఆయన ఇక్కడ భారీ మెజారిటీతో విజయం సాధించారు. అయితే ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి వీపీ అబ్దుల్ రషీద్, బీజేపీ అభ్యర్థి కె. రంజిత్ నుంచి ఆయనకు గట్టి పోటీ ఎదురైనట్లు తెలుస్తోంది. కంచుకోట వంటి ఈ స్థానంలో ఓట్ల శాతం తగ్గడం కూడా వామపక్ష కూటమిని ఆందోళనకు గురిచేస్తోంది.మే 4న తేలనున్న కేరళ భవిష్యత్తు కేరళలో ఏప్రిల్ 9న ఒకే దశలో జరిగిన ఎన్నికల్లో దాదాపు 78.27 శాతం ఓటింగ్ నమోదైంది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ హ్యాట్రిక్ సాధిస్తుందా? లేదా కేరళ సంప్రదాయం ప్రకారం మళ్లీ యూడీఎఫ్ అధికారంలోకి ఫలితాల్లో తేలిపోనుంది.

# ఇటుకలతో కొట్టి నలుగురు పిల్లల దారుణ హత్య.. పరారీలో తల్లి

**లక్నో:** తోబుట్టువులైన నలుగురు పిల్లలను ఇటుకలతో కొట్టి దారుణంగా హత్య చేశారు. ఇంటి లోపల నుంచి లాక్ వేసి పారిపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పరారీలో ఉన్న పిల్లల తల్లిపై అనుమానం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మురాదాబాద్ మొహల్లాలో తాళం వేసి ఉన్న ఒక ఇంటి లోపల నలుగురు పిల్లల



మృతదేహాలు పడి ఉన్నాయని శనివారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు.కాగా, లోపల నుంచి లాక్ వేసి ఉన్న ఆ ఇంట్లోకి పోలీసులు ప్రవేశించారు. తోబుట్టువులైన నలుగురు పిల్లలను ఇటుకలతో కొట్టి దారుణంగా హత్య చేసినట్లు గమనించారు. మృతుల్లో ముగ్గురు బాలురు, ఒక బాలిక ఉన్నారు. సఫిక్ (14), సౌద్ (12), ఉమర్ (10), బయాన్ బానో (8)గా వారిని గుర్తించారు. సొంత తోబుట్టువులైన ముస్లిం పిల్లల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మరోవైపు పిల్లల తల్లి పేరుతో ఆ ఇల్లు రిజిస్టర్ అయినట్లు పోలీసులు తెలుసుకున్నారు. పిల్లలను చంపిన తర్వాత గోడ దూకి ఆమె పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. ఆ ఇంటిని సీజ్ చేశారు.

# సామాన్యులకు బిగ్ షాక్.. పాల ధరలు భారీగా పెంపు

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. అలాగే గ్యాస్ సిలిండర్ సరఫరాలోనూ ఆలస్యం జరుగుతోంది. దాంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అలాగ గ్యాస్ సిలిండర్ సరఫరాలో జాప్యం నెలకొంది. ఈ క్రమంలో తాజాగా పాల ధరలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కో లీటర్ పై రూ. 4 పెంచుతూ ఆదేశాలు ఇచ్చింది. పెంచిన ధరలు మే 3 ఆదివారం నుంచి అమల్లోకి రానున్నాయి. దాంతో రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఇది పెద్ద షాక్ అని చెప్పొచ్చు.ఒడిశా రాష్ట్ర సహకార పాలు ఉత్పత్తిదారుల సమాఖ్య పాల ధరలను పెంచింది. లీటర్ కు రూ. 4 చొప్పున పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెరిగిన పాల ధరలు మే 3 ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి. పెరిగిన పాల ధరల ప్రకారం వివిధ పాల ప్యాకెట్ల ధరలు చూస్తే.. టోన్ మిల్క్ ధర లీటరు



ప్రస్తుతం రూ. 50 ఉండగా అది కాస్తా రూ. 54 కు చేరింది. ఇక ప్రీమియం మిల్క్ ధర లీటర్ రూ. 54 నుంచి రూ. 58 కు చేరింది. అలాగే గోల్డ్ ప్రీమియం పాల ధర లీటర్ రూ. 56 నుంచి రూ. 60 కు పెరిగింది. చివరగా గోల్డ్ ప్రీమియం ప్లస్ పాల ప్యాకెట్ ధర లీటర్ రూ. 60 నుంచి రూ. 64 కు చేరింది.రాష్ట్రంలో పాల సేకరణ, ప్రాసెసింగ్, రవాణా ఖర్చులు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పాల ధరలను పెంచినట్లు ఒడిశా రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ వివరణ ఇచ్చారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. పాల ధరల పెంపు కారణంగా రాష్ట్రంలోని దాదాపు 3 లక్షల మంది పాడి రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఇక రాష్ట్రంలో పాల సేకరణ ధర కూడా పెరిగింది. ఆవు పాలు లీటర్ కు రూ.1 పెంచడం కారణంగా రైతులకు చెల్లించే ధర రూ. 40 కు చేరుకుంది. అలాగే గేదె పాల సేకరణ ధర కూడా పెంచారు.

# ఆ వేధింపులకు గురైంది నేనే: మౌనం వీడిన స్టార్ రెజ్లర్

భారత కుస్తీ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తూ స్టార్ రెజ్లర్ ఒలింపియన్ వినేష్ ఫోగాట్ సంచలన నిజాన్ని బయటపెట్టారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన ఆరుగురు మహిళా క్రీడాకారిణులలో తాను కూడా ఒకరినని ఆమె మొదటిసారిగా బహిరంగంగా అంగీకరించారు. ఆదివారం (మే 3) విడుదల చేసిన ఓ భావోద్వేగ వీడియో సందేశంలో వినేష్ ఫోగాట్ తన గోడును వెళ్లగక్కారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉండటం, బాధితుల గుర్తింపును రహస్యంగా ఉంచాలన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాల కారణంగా తాను ఇప్పటివరకు మౌనంగా ఉన్నానని ఆమె తెలిపారు. అయితే ప్రస్తుతం తన రీ-ఎంట్రీకి ఎదురవుతున్న అడ్డంకులు, రెజ్లింగ్ ఫెడరేషన్ వైఖరి తనను ఈ నిజాన్ని బయటపెట్టేలా చేశాయని ఆమె పేర్కొన్నారు.ట్రయల్స్ వేదికపై అభ్యంతరం2026 ఆసియా క్రీడలకు ముందు నిర్వహించబోయే సెలక్షన్ ట్రయల్స్ వేదికపై వినేష్ ఫోగాట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ట్రయల్స్‌ను



కావాలనే ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో నిర్వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. గోండా అనేది బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు కంచుకోట వంటిదని, అక్కడ ఒక ప్రైవేట్ కళాశాలలో పోటీలు నిర్వహించడం ద్వారా పారదర్శకత లోపిస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిజ్ భూషణ్ ప్రభావం ఉన్న చోట నిష్పక్షపాతంగా ఎంపిక జరుగుతుందన్న నమ్మకం లేదని వినేష్ ఫోగాట్ స్పష్టం చేశారు.వ్యవస్థపై బ్రిజ్ భూషణ్ పట్టు

బ్రిజ్ భూషణ్ ప్రస్తుతం అధికారిక పదవిలో లేకపోయినా.. కుస్తీ సమాఖ్య కార్యకలాపాలపై ఆయన ప్రభావం ఇంకా కొనసాగుతోందని వినేష్ ఫోగాట్ ఆరోపించారు. "నేను స్వయంగా ఫిర్యాదు చేసిన ఆరుగురు బాధితుల్లో ఒకరిని, ప్రస్తుతం నా సాక్ష్యం కోర్టులో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన ఇలాకాలోకి వెళ్లి పోటీ చేయడం మానసికంగా, భావోద్వేగపరంగా చాలా కష్టం" అని ఆమె అన్నారు. మ్యాచ్ రెఫరీలు ఎవరు ఉండాలి, ఎవరికి ఎన్ని పాయింట్లు ఇవ్వాలి అనే విషయాల్లో బ్రిజ్ భూషణ్ అనుచరుల జోక్యం ఉంటుందని వినేష్ ఫోగాట్ అనుమానం వ్యక్తం చేశారు. 2023లో వినేష్ ఫోగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా వంటి అగ్రశ్రేణి రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సుదీర్ఘ నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో క్రీడాకారుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అంతర్జాతీయ స్థాయిలో విమర్శలకు దారితీసింది. బ్రిజ్ భూషణ్ ఈ ఆరోపణలను వరుసగా తోసిపుచ్చుతున్నప్పటికీ, లైంగిక వేధింపుల కేసులో విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. సుమారు 18 నెలల విరామం తర్వాత తిరిగి రింగ్‌లోకి రావాలని చూస్తున్న వినేష్‌కు, తాజా పరిస్థితులు సవాలుగా మారాయి. ఈ వ్యవహారంపై క్రీడా మంత్రిత్వ శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ కు చెక్



ముంబై ఇండియన్స్ ఐపీఎల్ ప్లేఆఫ్ చేరే అవకాశాలకు చెక్ పడింది. చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో ఓడిపోవడంతో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శనివారం రాత్రి చెన్నై చెపాక్ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ఎనిమిది వికెట్ల తేడాతో ఓటమి పాలైంది ముంబై ఇండియన్స్. ఈ జట్టు నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ అజేయ అర్ధసెంచరీతో చెన్నై సునాయసంగా అందుకుంది. ప్రత్యర్థులపై సీజన్ డబుల్ పూర్తిచేసింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. నమన్ ధీర్ 57 హాఫ్ సెంచరీతో రాణించినా.. మిగతా బ్యాటర్లు విఫలం అయ్యారు. మొన్నటి మ్యాచ్ లో సెంచరీతో అదరగొట్టిన ర్యాన్ రికెల్టన్ ఇక్కడ కూడా దూకుడుగా ఆడాడు గానీ ఎక్కువ సేపు క్రీజ్ లో నిల్చోలేకపోయాడు. సూర్యకుమార్ యాదవ్- 21, కేప్టెన్ హార్దిక్ పాండ్యా- 18, తిలక్ వర్మ- 5 మళ్లీ విఫలం అయ్యా రు. అనంతరం సీఎస్‌కే 18.1 ఓవర్లలో 2 వికెట్లకు 160 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్- 67, కార్తీక్ శర్మ- 54 అజేయ హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. ఓపెనర్ సంజు శాంసన్ 11 పరుగులే చేసినా మరో ఓపెనర్ ఉర్విల్ పటేల్ దూకుడుగా ఆడాడు. ఈ ఓట మితో ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి. తొమ్మిది మ్యాచ్‌లలో రెండు విజయాలతో నాలుగు పాయింట్లు మాత్రమే ఈ జట్టు ఖాతాలో ఉన్నాయి. ప్లేఆఫ్స్ చేరాలంటే.. మిగిలిన అయిదు మ్యాచ్‌లలోనూ గెలిస్తే గరిష్ఠంగా 14 పాయింట్లను చేరుకు ంటుంది. 14 పాయింట్లతో ప్లేఆఫ్‌లకు అర్హత సాధించడం సాధ్యమే అయినప్పటికీ, అది ఇతర జట్ల అనుకూల ఆధారపడి ఉంటుంది.

## హార్దిక్ కు సహకరించట్లేదా బాంబుపేల్చిన మాజీ..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత చెత్త ప్రదర్శనతో టోర్నీ నుంచి దాదాపు నిష్క్రమించిన ముంబై ఇండియన్స్ జట్టుకు కెప్టెన్ గా ఉన్న హార్దిక్ పాండ్యా అంతకంటే ఎక్కువ విమర్శలే ఎదుర్కొంటున్నాడు. కెప్టెన్ గా, బ్యాటర్ గా, బౌలర్ గా విఫలమవుతున్న హార్దిక్ పాండ్యా వల్లే జట్టు ఇలాంటి పరిస్థితుల్లో ఉందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అయితే హార్దిక్ సొంత వైఫల్యం ఓ ఎత్తు, జట్టు నుంచి అందని సహకారం మరో ఎత్తని భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ వెల్లడించాడు. తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ఓడిపోయి, ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ ఏడో ఓటమిని చవిచూసిన తర్వాత, హార్దిక్ విమర్శల నుండి తప్పించుకోవడం కష్టంగా మారింది.

అయితే ఈ సీజన్‌లో ముంబై పేలవ ప్రదర్శనకు ప్రధాన కారణంగా హార్దిక్‌ను ముద్ర వేయడం సరికాదని భారత మాజీ బ్యాటర్ మనోజ్ తివారీ అభిప్రాయపడ్డాడు. ఎందుకంటే, అతను కోరుకున్న స్థాయిలో సహచర ఆటగాళ్ల నుండి అతనికి మద్దతు లభించలేదని అన్నాడు. క్రిక్‌బజ్‌లో మాట్లాడుతూ తివారీ.. ముంబై ఐపీఎల్ 2026 సీజన్ ఇప్పటికే ముగిసిపోయిందని తేల్చేశాడు. జట్టు వైఫల్యాల నిందలను భరించాల్సి వచ్చినప్పుడు, ఇతరుల నుండి ఎలాంటి మద్దతు లేకుండా ముంబై కెప్టెన్ ఇంతకాలం ఒంటరిగా నిలబడాల్సి వచ్చిందని మనోజ్ తివారీ తెలిపాడు. ఒక కెప్టెన్ ప్రతి ఆటగాడి నమ్మకాన్ని గెలుచుకోవాలని, అతను ఒక నాయకుడిగా ఉండాలని, అయితే, హార్దిక్‌కు ఎవరూ అండగా నిలబడటం లేదనిపిస్తోందన్నాడు. అతనికి అవసరమైన మద్దతు అస్సలు లేదన్నాడు. కెప్టెన్‌కు ఒక పాత్ర ఉందని, కానీ అతను సరిగ్గా ఆడటం లేదన్నాడు. కానీ అంతకు మించి, ఇతర ఆటగాళ్లు బాధ్యత తీసుకో వాలన్నాడు. ఉదాహరణకు సూర్య నిలకడగా రాణించడం లేదని, తిలక్ ఒక మంచి మ్యాచ్ తర్వాత తన ఫామ్‌ను కొనసాగించలేదని గుర్తుచేశాడు. జట్టు నుండి ఎలా ప్రశ్నించాడు.

# నక్కతోక తొక్కొచ్చిన రాజస్థాన్ రాయల్స్: రూ. 15,600 కోట్ల భారీ డీల్ సెట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. టాప్ ఫ్రాంచైజీల్లో ఒకటైన రాజస్థాన్ రాయల్స్ చేతులు మారింది. దీనికి సంబంధించి ఓ భారీ డీల్ కుదిరింది. దేశీయ పారిశ్రామిక దిగ్గజాలు లక్ష్మీ నివాస్ మిట్టల్, ఆదిత్య మిట్టల్ దీన్ని కొనుగోలు చేశారు. వారి సారథ్యంలోని కన్సార్టియం రాజస్థాన్ రాయల్స్ ను కొనుగోలు చేసింది. దీని విలువ 15,600 కోట్ల రూపాయలు. సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత ఆదార్ పూనావాలా కూడా ఈ కన్సార్టియంలో ఉన్నారు .ఈ ఒప్పందంలో ఐపీఎల్ జట్టుకు మాత్రమే పరిమితం కాలేదు. దక్షిణాఫ్రికా ప్రీమియర్ లీగ్ ఎస్ఏ20 ఫ్రాంచైజీ పెర్ల్ రాయల్స్, కరీబియన్ ప్రీమియర్ లీగ్ టీమ్ బార్బడోస్ రాయల్స్ కూడా ఉన్నాయి. ఈ మూడు టీమ్ లను కూడా ఇప్పుడున్న రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం నుంచి కొనుగోలు చేసింది ఈ మిట్టల్ ఫ్యామిలీ, ఆదార్ పూనావాలాతో కూడిన కన్సార్టియం. డీల్ పూర్తయిన తర్వాత.. ఇందులో మిట్టల్ కుటుంబానికి సుమారు 75 శాతంవాటా లభిస్తుంది. అదార్ పూనావల్ల దాదాపు 18 శాతం స్టేక్స్ ను కలిగి ఉంటారు.

మిగిలిన ఏడు వాటా ప్రస్తుత ఫ్రాంచైజీ యాజమాన్యం మనోజ్ బదాలే వద్దే ఉంటుంది. ఈ ఫ్రాంచైజీతో అనుబంధంగా కొనసాగుతారు బదాలే. ఈ డీల్‌కు బీసీసీఐ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఇంకా ఆమోదించాల్సి ఉంది. వీటితో పాటు ఇతర రెగ్యులేటరీ అథారిటీల ఆమోదం ఇంకా లభించలేదు. ఈ ప్రక్రియ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నాటికి అంటే అక్టోబర్- నవంబర్- డిసెంబర్ నాటికి పూర్తవుతుందని అంచనాఈ ఒప్పందం కార్యరూపం దాల్చిన తర్వాత లక్ష్మీ నివాస్ మిట్టల్, ఆదిత్య మిట్టల్, వనిషా మిట్టల్ భాటియా, అదార్



పూనావాలా, మనోజ్ బదాలే.. రాజస్థాన్ రాయల్స్ బోర్డులో చేరుతారు. ఈ భారీ డీల్ పై లక్ష్మీ నివాస్ మిట్టల్ స్పందించారు. రాజస్థాన్‌తో తనకు దీర్ఘకాల అనుబంధం ఉందని, అలాగే క్రికెట్ అన్నా తనకు ఎంతగానో ఇష్టమని పేర్కొన్నారు. ఈ కారణంతోనే క్రికెట్ ను ఆస్వాదించడానికి రాజస్థాన్ రాయల్స్ కంటే మెరుగైన జట్టు మరేదీ ఉండదని వ్యాఖ్యానించారు.

# కాక మీదున్న సన్‌రైజర్స్ తో కేకేఆర్ క్లాష్: తుదిజట్టులో..

ఈ ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (గా=ఎ) తడాఖా చూపుతోంది. భారీ విజయాలతో దూసుకెళ్తోంది. వరుసగా అయిదు విజయాలను తన ఖాతలో వేసుకుంది. మొన్నటికి మొన్న ముంబై ఇండియన్స్ ను వాళ్ల సొంత గడ్డ వాంఖెడే స్టేడియంలో చితగ్గొట్టడం అదరహో అనిపించుకుంది. ఈ మ్యాచ్ లో ఓడిన దెబ్బకు ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరింది. ప్లేఆఫ్స్ పై దాదాపుగా ఆశలు వదులు కున్నట్టయింది. ఈ ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంటోంది. గెలవడం ఒక అలవాటుగా మార్చుకున్న ఈ జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. రాజస్థాన్ రాయల్స్‌ను నిలువరించినప్పటి నుండి దాని దశ తిరిగింది. ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ వంటి పెద్దగా తెలియని ఆటగాళ్లు కూడా అద్భుత ప్రదర్శన చేయడంతో సన్‌రైజర్స్ అయిదు వరుస విజయాలను నమోదు చేసింది. చివరి రెండు విజయాలు 200లకు పైగా లక్ష్యాలను అందుకున్నవే కావడం, పైగా ప్రత్యర్థి గ్రౌండ్ లో దీన్ని సాధించడంకోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడబోతోంది సన్ రైజర్స్ హైదరాబాద్. ఈ మధ్యాహ్నం 3:30 గంటలకు మ్యాచ్ ఆరంభమౌతుంది. బ్యాటింగ్ లో అద్భుతమైన ఫామ్‌లో ఉందీ సన్ రైజర్స్. అభిషేక్ శర్మ- 425, హెన్రిచ్ క్లాసెన్ 414 పరుగులు చేసి, బ్యాటింగ్ ఛార్ట్‌లో వరుసగా రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. ఇషాన్ కిషన్ కూడా 312 పరుగులతో రాణిస్తున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ ఒత్తిడిలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు.

ముంబై ఇండియన్స్‌పై 30 బంతుల్లో అజేయంగా 65 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపిన తీరు క్లాసెన్ సామర్థ్యాన్ని చాటింది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ భారీ స్కోర్ చేస్తోన్నప్పటికీ.. నిలకడగా ఆడట్లేదు. క్లాసెన్ అలాక్కాదు. ప్రతి మ్యాచ్ లోనూ మినిమమ్ గ్యారంటీతో పరుగులు రాబట్టుకుంటోన్నాడు. మిడిలార్డర్ లో బ్యాటింగ్ బ్యాక్‌బోన్ గా నిలుస్తున్నాడు. బౌలింగ్ లో ఎహసాన్ మలింగ సత్తా చాటుతున్నాడు. జట్టు



విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

ఇప్పటి వరకు సన్ రైజర్స్, కోల్ కత నైట్ రైడర్స్ మధ్య మొత్తం 31 మ్యాచ్‌లు జరిగాయి. వీటిల్లో సన్‌రైజర్స్ 11 గెలిచింది. 20 గేమ్ లల్లో నైట్ రైడర్స్ సత్తా చాటింది. తాజాగా ఈ మ్యాచ్ కు ఆతిథ్యాన్ని ఇస్తోన్న ఉప్పల్ పిచ్ బ్యాటింగ్ ఫ్రెండ్లీ పిచ్. ఛేజింగ్‌కు అనుకూలంగా ఉండొచ్చు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయింగ్ 11లో.. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, సలీల్ అరోరా, అనికేత్ వర్మ, పాట్ కమిన్స్ (కెప్టెన్), హర్ష్ దూబే, సాకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే ఆడే అవకాశం ఉంది.

## సన్‌రైజర్స్‌కు ఊహించని స్ట్రోక్.. ఆరో విజయాన్ని అడ్డుకున్న కోల్‌కతా..!

అదిరే ఆటతో వరస విజయాలతో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ కల చెదిరింది. డబుల్ హ్యాట్రిక్‌తో టేబుల్ టాపర్ అవ్వాలనుకున్న కమిన్స్ సేనకు కోల్‌కతా నైట్ రైడర్స్ బిగ్ షాకిచ్చింది. మిస్టరీ స్పిన్నర్లు తిప్పేయడంతో హిట్టర్లతో నిండిన హైదరాబాద్‌ను 165 పరుగుల వద్దే ఆపిన కోల్‌కతా రఘువంశీ(59), సారథి అజింక్యా రహానే(43)ల విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(18 నాటౌట్) లాంఛనం ముగించడంతో కోల్‌కతా మూడో విజయంతో మురిసింది. పంతొమ్మిదో సీజన్‌లో చెలరేగిపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు కోల్‌కతా నైట్ రైడర్స్ బ్రేకులు వేసింది. ఉప్పల్ స్టేడియంలో బ్యాటర్లు తేలిపోవడంతో తక్కువ స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బౌలర్లు కాపాడలేకపోయారు. స్వల్ప లక్ష్యాన్ని కోల్‌కతా ఆడుతూపాడుతూ ఛేదించింది. ఆరెంజ్ ఆర్మీని 165కే కట్టడి చేసిన కేకేఆర్‌కు ఓపెనర్లు శుభారంభమిచ్చారు.

కోల్‌కతాను గెలుపు దిశగా నడిపించిన ఈ జోడీని



విడదీసేందుకు సన్‌రైజర్స్ సారథి కమిన్స్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపో యి ది. జట్టు విజయానికి 33 రన్స్ అవస రమైన వేళ షకీబ్ ఓవర్లో రహానే ఔట య్యాడు. కాసేపటికే రఘువంశీని శివాంగ్ వెనక్కి పంపాడు. అప్పటికే లక్ష్యం కరిగిపోగా.. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(18 నాటౌట్), గ్రీన్(3 నాటౌట్) లాంఛనం ముగించారు. దాంతో, వరసగా ఆరో విజయంతో టాప్‌లోకి దూసుకెళ్లాలనుకున్న హైదరాబాద్ ఆశలు ఆడియాశలయ్యాయి. హెడ్, ఇషాన్ దంచినా.. సొంత గడ్డపై భారీ స్కోర్‌తో అనూహ్యంగా తడబడింది

## రూ. 14 కోట్లకి ఫైనల్‌గా న్యాయం చేసిన సీఎస్కే కుర్రోడు.. హాఫ్ సెంచరీతో ముంబైని మట్టికరిపించిన కార్తీక్ శర్మ



చెన్నై సూపర్ కింగ్స్ కాస్ట్లీ ప్లేయర్ కార్తీక్ శర్మ ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చాడు. రూ. 14.2 కోట్లతో కొనుగోలు చేసిన కార్తీక్ శర్మ ఎట్టకేలకు తాను తీసుకున్న డబ్బులకు న్యాయం చేశాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కార్తీక్ శర్మ 40 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 54 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కార్తీక్ శర్మ పర్ఫార్మెన్స్‌కు సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఫిదా అయ్యారు.

దేశీయ క్రికెట్‌లో రాణించిన కార్తీక్ శర్మ ఈ ఐపీఎల్ ఆరంభంలో పెద్దగా ప్రభావం చూపలేదు. ఐదు మ్యాచ్‌లలో అవకాశం ఇచ్చినా తనను తాను నిరూపించుకోలేక పోయాడు. దాంతో చివరగా ముంబై ఇండియన్స్ మీద ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే కాకుండా.. కీలక మ్యాచ్‌ని గెలిపించి గన్ సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. హెడ్ కోచ్, బ్యాటింగ్ కోచ్, కెప్టెన్‌తో సహా అందరూ ఇప్పుడు కార్తీక్ శర్మను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. చెపాక్ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలు గో స్థానంలో బ్యాటింగ్‌కి వచ్చిన కార్తీక్ శర్మ 40 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 54 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. క్లాస్ షాట్స్ ఆడుతూ.. అనవసర ప్రయోగాలకు వెళ్లకుండా సెలెక్టర్లు, కోచ్‌లను మెప్పించాడు. కార్తీక్ శర్మ, రుతురాజ్ అద్భుత భాగస్వామ్యం అందించడంతో ముంబైపై చెన్నై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కార్తీక్ శర్మ చాలా మంచి ఆట ఆడాడని హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ అన్నాడు. వేలంలో మిగతా ప్లేయర్లతో పోల్చితే భారీ ధరే పలికినప్పటికీ దానికి తగ్గ ఫలితం ఈ రోజు మ్యాచ్‌లో చూయించాని చెప్పాడు. కార్తీక్ శర్మ రోజురోజుకూ తన ఆటతీరును మెరుగుపరుచుకుంటూ, జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించడం చాలా సంతోషంగా ఉందని ఫ్లెమింగ్ అన్నాడు.

# రోవ్‌మన్ కాదు, సూపర్ మ్యాన్ పోవెల్.. కళ్లు చెదిరే క్యాచ్‌తో క్లాసెన్‌కు షాక్..!

సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న హెన్రిచ్ క్లాసెన్.. కేకేఆర్‌తో మ్యాచులో తక్కువ స్కోరుకే ఔట్ అయ్యాడు. అయితే క్లాసెన్ ఇలా ఔట్ కావడంలో కేకేఆర్ ఆల్ రౌండర్ రోవ్‌మన్ పావెల్ కీలక పాత్ర పోషించాడు. ఒంటి చేత్తో కళ్లు చెదిరే క్యాచ్ పట్టి.. అతడిని పెవిలియన్‌కు పంపించాడు. డీప్ మిడ్ వికెట్ వద్ద ఉన్న పోవెల్ అద్భుతంగా పక్కకు పరుగెత్తి గాల్లోకి జంప్ చేస్తూ ఒంటిచేత్తో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. కిందపడినా బ్యాలెన్స్ కోల్పోకుండా బంతిని వదల్లేదు. ఈ క్యాచ్‌తో క్లాసెన్ కేవలం 11 పరుగులకే వెనుదిరగాల్సి వచ్చింది. ఐపీఎల్ 2026లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్‌లో కళ్లు చెదిరే క్యాచ్ పట్టాడు రోవ్‌మన్ పోవెల్ . ఉప్పల్ వేదికగా జరిగిన ఈ మ్యాచులో సూపర్ క్యాచ్‌తో సన్ రైజర్స్ స్టార్ ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్‌ను పెవిలియన్ పంపించాడు. దీంతో ఈ సీజన్‌లో తొలిసారి క్లాసెన్ 25 పరుగుల కంటే తక్కువ స్కోరుకే వెనుదిరగాల్సి వచ్చింది. కీలకప్లేయర్ క్లాసెన్ త్వరగా ఔట్ కావడంతో సన్ రైజర్స్ హైదరాబాద్ కుప్పకూలిపోయింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ సందర్భంగా కామెరూన్ గ్రీన్ వేసిన 11వ ఓవర్‌లో పోవెల్ సూపర్ క్యాచ్ పట్టాడు. ఈ ఓవర్ నాలుగో బంతిని క్లాసెన్.. డీప్ మిడ్ వికెట్ దిశగా భారీ షాట్ ఆడాడు. సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న పోవెల్ తన కుడివైపు పరుగెత్తి గాల్లోకి జంప్ చేసి సింగిల్ హ్యాండ్ క్యాచ్ అందుకున్నాడు. బ్యాలెన్స్ కోల్పోయి కిందపడినా.. బంతిని మాత్రం వదల్లేదు. ఇది క్లియర్ క్యాచా.. కాదా అని పలు యాంగిల్స్‌లో రిప్లేలను పరిశీలించిన థర్డ్ అంపైర్.. చివరకు ఔట్ అని ప్రకటించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ క్యాచ్ చూసిన అభిమానులు.. రోవ్‌మన్ పావెల్ కాదు.. సూపర్ మ్యాన్ పావెల్ అని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు నెటిజన్లు.. ఇది క్యాచ్ ఆఫ్ ది టోర్నీ అని పేర్కొంటున్నారు.కాగా ఈ సీజన్‌లో హెన్రిచ్ క్లాసెన్ .. 25 రన్స్ కంటే తక్కువ స్కోరుకు ఔట్ కావడం ఇదే తొలిసారి కావడం గమ నార్హం. ఓవరాల్‌గా చూసుకుంటే.. క్లాసెన్ వరుసగా 13 ఐపీఎల్ మ్యాచ్‌లలో 20+ స్కోర్లు నమోదు చేశాడు. మరో నాలుగు మ్యాచులలో అతడు 20కి పైగా రన్స్ చేస్తే..



ఐపీఎల్‌లో వరుసగా అత్యధిక సార్లు ఈ ఫీట్ సాధించిన ప్లేయర్‌గా నిలిచే వాడు. ఈ జాబితాలో సూర్యకుమార్ యాదవ్.. అగ్రస్థానంలో ఉన్నాడు. గత సీజన్‌లో అతడు వరుసగా 16 ఐపీఎల్ మ్యాచ్‌లలో 20+ స్కోర్లు నమోదు చేశాడు. హెన్రిచ్ క్లాసెన్ 13 సార్లు ఈ ఫీట్ సాధిం చాడు. శిఖర్ ధావన్ (11 సార్లు), రాబిన్ ఉతప్ప (10 సార్లు), సాయి సుదర్శన్ (10 సార్లు) ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

# గేయరచయిత చంద్రబోస్ కుటుంబంలో విషాదం.. సోదరుడు రాజేంద్ర గుండెపోటుతో మృతి



ప్రసిద్ధ గేయరచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు రాజేంద్ర (60) ఆకస్మిక గుండెపోటుతో కన్నుమూశారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, సన్నిహితులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. అన్నమయ్య జిల్లాలోని కలికిరి ప్రాంతానికి చెందిన రాజేంద్ర, వ్యాపార పనుల నిమిత్తం బెంగళూరు నుంచి ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. శనివారం రాత్రి తన స్నేహితుడు శ్రీనివాసరెడ్డి నివాసంలో బస చేసినట్లు సమాచారం. ఆదివారం ఉదయం ఆయనకు స్వల్ప అసౌకర్యం కలగడంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. అయితే కొంతసేపటికి ఆరోగ్యం బాగానే ఉందని భావించి బయటకు వచ్చారు. అనంతరం కలికిరి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఓ హోటల్‌లో టిఫిన్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ుండెపోటుకు గురయ్యారు. అక్కడున్న వారు వెంటనే స్పందించి సమీప వైద్యులకు సమాచారం అందించారు. అయితే అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాజేంద్ర మృతితో కలికిరి పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ వార్త తెలిసిన వెంటనే పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు చంద్రబోస్ కుటుంబానికి తమ సానుభూతి తెలియజేశారు. ఇక కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోగా, రాజేంద్ర మృతి పట్ల స్థానిక ప్రజలు కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సమాచారం. అంతర్జాతీయ వేదికలపై తెలుగు ప్రతిష్ఠను నిలబెట్టిన చంద్రబోస్ కుటుంబంలో ఇలా అకస్మాత్తుగా విషాదం చోటుచేసుకోవడం అందరినీ కలచివేసింది. ఈ ఘటనపై సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, చంద్రబోస్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.


# బ్రేకప్ తర్వాత మళ్లీ ప్రేమలో పడ్డ అక్షరా సింగ్.. కానీ ప్రియుడి పేరు మాత్రం సీక్రెట్‌గానే..



భోజ్‌పురి సినీ పరిశ్రమలో ఒకప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచిన పవన్ సింగ్– అక్షరా సింగ్ ప్రేమకథ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో ఈ ఇద్దరి రిలేషన్‌షిప్ పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు బ్రేకప్ తర్వాత అక్షరా సింగ్ మళ్లీ ప్రేమలో పడినట్లు వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన అక్షరా సింగ్ తన లవ్ లైఫ్ గురించి ఓపెన్ అయ్యారు. "అవును, నేను ప్రస్తుతం ప్రేమలో ఉన్నాను" అని స్పష్టంగా చెప్పారు. అయితే ఆ ప్రేమ గురించి పూర్తి వివరాలు వెల్లడించడానికి ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. "ప్రేమ అనే పదంలోని మొదటి అక్షరం వద్దనే ఉన్నాను. పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత మరిన్ని విషయాలు చెబుతాను" అంటూ ఆసక్తికరంగా స్పందించారు. గతంలో పవన్ సింగ్‌తో అక్షరా సింగ్ ప్రేమలో ఉన్నారని, ఇద్దరూ పెళ్లి చేసుకుంటారని కూడా ప్రచారం జరిగింది. కానీ 2018లో పవన్ సింగ్ జ్యోతి సింగ్‌ను వివాహం చేసుకోవడంతో వారి బంధం ముగిసింది.

అనంతరం అక్షరా సింగ్ ఆయనపై పలు ఆరోపణలు చేయడం కూడా పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ ప్రేమలో ఉన్నానని చెప్పినప్పటికీ, తన ప్రియుడి పేరును మాత్రం అక్షరా సింగ్ వెల్లడించలేదు. "పేరు చెప్పితే దిష్టి తగులుతుందేమో అనిపిస్తోంది" అంటూ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం తన ప్రేమను అర్థం చేసుకునే దశలో ఉన్నానని, భవిష్యత్తులో భాగస్వామి మనస్తత్వం తనకు సరిపోతుందా లేదా అన్నది తెలుసుకున్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని ఆమె స్పష్టం చేశారు. మొత్తానికి, గత ప్రేమ విఫలమైనా ముందుకు సాగుతూ కొత్త జీవితాన్ని ఆహ్వానిస్తున్న అక్షరా సింగ్ నిర్ణయం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి ఈ అమ్మడు తన లవ్‌కి సంబంధించిన పూర్తి విషయాలు ఎప్పుడు చూస్తున్నారు.

# భార్య మాటతో మారిన జీవితం.. నాలుగేళ్ల ప్రయాణం వెనుక మాధవన్ చెప్పిన ఆసక్తికర విషయాలు



సినిమా ప్రపంచంలో ఓ వెలుగు వెలిగే స్టార్‌ల జీవితాలు బయటకు ఎంతో హుందాగా కనిపించినా, వారి వ్యక్తిగత జీవితాల్లో ఎన్నో ఒత్తిడులు ఉంటాయి. ముఖ్యంగా దాంపత్య జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలు కొందరిని కుంగదీస్తే, మరికొందరిని కొత్త దారులు వెతుక్కోవడానికి ప్రేరేపిస్తాయి. అలాంటి అనుభవాన్నే ప్రముఖ నటుడు మాధనవ్ తాజాగా బయటపెట్టారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన మాధవన్ తన జీవితంలో కరోనా కాలం ఎంత పెద్ద మలుపు తీసుకువచ్చిందో వివరించారు. పని లేక ఇంట్లో ఖాళీగా ఉండాల్సి వచ్చిన సమయంలో, తన భార్య సరిత చెప్పిన మాటలు తనను లోలోపల కుదిపేశాయని తెలిపారు. "నువ్వు ఖాళీగా ఉండ డాన్ని నేను ఎప్పుడూ చూడలేదు. పని ఉన్నప్పుడే నీలో ఉత్సాహం కనిపిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు మొదట బాధపెట్టినా, తర్వాత ఆలోచింపజేశాయని ఆయన చెప్పారు. ఆ మాటల ప్రభావంతో నాలుగేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉండి దేశమంతా తిరిగినట్లు మాధవన్ వెల్లడించారు. ఈ ప్రయాణంలో అనేక మందిని కలుసుకుని, వారి జీవితాలను తెలుసుకుంటూ ఎన్నో అనుభవాలు సొంతం చేసుకున్నానని తెలిపారు. ఈ అనుభవాలు తనలో కొత్త ఆలోచనలను కలిగించాయని, జీవితాన్ని మరో కోణంలో చూడడం నేర్పించాయని ఆయన చెప్పారు. ఇక తన కెరీర్ గురించి చెప్పుకుంటూ, చిన్న చిన్న టీవీ పాత్రలతో మొదలైన తన ప్రయాణం ఎలా సినిమాల వరకు వచ్చిందో వివరించారు. 'మిన్నలే' సినిమాతో వచ్చిన గుర్తింపు, అదే కథతో తెలుగులో వచ్చిన 'సఖి' ద్వారా దక్షిణాది ప్రేక్షకులకు దగ్గరైన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. తర్వాత అనేక భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నట్లు తెలిపారు. క్రీడా వార్తలు

ఈ అనుభవాల తర్వాత తన సినిమాల ఎంపికలో కూడా మార్పు వచ్చిందని, విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నానని మాధవన్ అన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ అవుతున్నాయి.

# 'దేవర 2' ఆగిందంటూ ప్రచారాలు .. అభిమానుల సందేహాలకు చెక్



టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్స్‌లో 'దేవర 2' ఒకటి. కానీ ఇప్పటివరకు ఈ సినిమాపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో నందమూరి అభిమానుల్లో కొంత ఆందోళన నెలకొంది. ముఖ్య ంగా దర్శకుడు కొరటాల శివ, నందమూరి బాలకృష్ణతో కొత్త సినిమా ఖరారు చేసుకోవడంతో 'దేవర 2' ప్రాజెక్ట్ నిలిచిపోయిందనే వార్తలు జోరుగా వినిపించాయి. ఇక హీరో ఎన్టీఆర్ వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉండటం, కొరటాల శివ ఇతర సినిమాలపై దృష్టి పెట్టడం వంటి పరిణామాలు ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చాయి. దీంతో 'దేవర' సీక్వెల్ ఉంటుందా లేదా అన్న సందేహం అభిమానులను కలవరపెట్టింది.

అయితే తాజా సమాచారం ప్రకారం అభిమానులు కంగారు పడాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. 'దేవర 2' కథ ఇప్పటికే సిద్ధంగా ఉందని, ఎన్టీఆర్‌కు కొరటాల శివ పూర్తి స్క్రిప్ట్‌ను వినిపించారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కమిట్‌మెంట్ల కారణంగా ఈ ప్రాజెక్ట్ ఆలస్యమవుతున్నప్పటికీ, ఈ కాంబినేషన్‌లో సీక్వెల్ రావడం ఖాయం అనే సంకేతాలు అందుతున్నాయి. మరోవైపు బాలకృష్ణ -- కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాను వేగంగా పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాక, 2027 జనవరి నాటికి కొరటాల శివ ఫ్రీ అవు తారని సమాచారం. ఆ వెంటనే 'దేవర 2'ను సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. దీంతో కొంత ఆలస్యమైనా, 'దేవర 2' ప్రాజెక్ట్ మాత్రం ఆగిపోలేదని స్పష్టమవుతోంది. కాబట్టి ఎన్టీఆర్ అభిమానులు ఇంకొంతకాలం వేచి రానుందని చెప్పొచ్చు.


# ఓటీటీలోకి మలయాళం బ్లాక్ బస్టర్ 'భరతనాట్యం 2: మోహినియాట్టం'



మలయాళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన బ్లాక్ బస్టర్ మూవీ 'భరతనాట్యం 2: మోహినియాట్టం' డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చేస్తోంది. కృష్ణదాస్ మురళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ డార్క్ కామెడీ థ్రిల్లర్, థియేటర్లలో భారీ వసూళ్లను సాధించడమే కాకుండా సుమారు రూ.40 కోట్ల కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద విజేతగా నిలిచింది. ఇక థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది.

సైజు కురుప్, సూరజ్ వెంజరమూడు, జగదీష్, వినయ్ ఫోర్ట్ వంటి హేమాహేమీలు నటించిన ఈ సినిమాలో రాపర్ బేబీ జీన్ కీలక పాత్రలో మెరిశారు. 2024లో వచ్చిన 'భారతనాట్యం' సినిమాకు ఇది సీక్వెల్. మొదటి భాగంలో భరతన్ నాయర్ కుటుంబం చుట్టూ ఉన్న రహస్యాలు, కుటుంబ గౌరవం కోసం వారు పడే ఇబ్బందులను చూపించారు. ఈ రెండో భాగం ఆ కథను మరింత ముందుకు తీసుకెళుతుంది. భరతన్ నాయర్ మరణం తర్వాత అతని కుటుంబ సభ్యులు ఎదుర్కొనే చిత్రవిచిత్రమైన సంఘటనల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ముఖ్యంగా భరతన్ నాయర్ రెండో భార్య మరియు ఆమె పిల్లలు కథలోకి ప్రవేశించినప్పుడు అసలు గందరగోళం మొదలవుతుంది. కుటుంబ సభ్యులందరూ కలిసి తమ పూర్వీకుల ఊరికి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ వారికి అనుకోని విధంగా కొన్ని వింతైన, అడపాదడపా భయపెట్టే సమస్యలు ఎదురవుతాయి. ఈ చిక్కుల నుంచి బయటపడటానికి వారు చేసే ప్రయత్నాలు, ఒకరినొకరు మోసం చేసుకోవడం, తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి సినిమాలో డార్క్ కామెడీ శైలిలో చూపించారు. అస్సలు ఊహించని పరిస్థితుల్లో ఒక నేరంలో ఇరుక్కుపోయిన ఈ కుటుంబం, తమ తెలివితేటలతో ఆ సమస్య నుండి ఎలా బయటపడింది? తమ మధ్య ఉన్న మనస్పర్థలను ఎలా పరిష్కరించుకుంది? అనేది ఈ సినిమా కథ. గత ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, విలక్షణమైన కథనంతో మలయాళ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. క్రైమ్ కామెడీ మరియు ఫ్యామిలీ డ్రామా కలయికతో రూపొందిన ఈ మూవీ ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా డిజిటల్ ప్రేక్షకులకు కూడా చేరువ కానుంది.


# షారుఖ్ ఖాన్ మంచి మనసు.. గర్భవతిగా ఉన్న దీపికా విషయంలో ఇంత కేరింగా..



బాలీవుడ్ స్టార్ హీరో షారూఖ్ ఖాన్ మరోసారి మంచి వ్యక్తిత్వంతో అభిమానులను ఆకట్టుకున్నారు. తెరపై 'కింగ్'గా పేరు సంపాదించుకున్న ఆయన, నిజజీవితంలోనూ అదే స్థాయిలో ప్రవర్తిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'కింగ్' సినిమా షూటింగ్ సందర్భంగా జరిగిన ఒక చిన్న సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రెండోసారి గర్భవతి అయిన దీపికా పదుకొణే మెట్లు ఎక్కుతున్నప్పుడు షారూఖ్... ఆమెని జాగ్రత్తగా నడిపించిన దృశ్యం నెటిజన్ల మనసులను దోచుకుంది. నలుపు దుస్తుల్లో కనిపించిన షారుఖ్, తన కో–స్టార్ పట్ల చూపిన ఆప్యాయత ఆయనలోని జెంటిల్‌మన్ స్వభావాన్ని మరోసారి బయటపెట్టింది.

ఈ వీడియో బయటకు వచ్చిన వెంటనే అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "అందుకే ఆయన కింగ్ ఖాన్ అయ్యారు" అని ఒకరు కామెంట్ చేయగా, "ఇదే నిజమైన గ్రీన్ ఫ్లాగ్ మేన్" అంటూ మరికొందరు స్పందిస్తున్నారు. గతంలో ఈ జంట కలిసి నటించిన ఓం శాంతి ఓం. చెన్నై ఎక్స్‌ప్రెస్, హ్యాపీ న్యూ ఇయర్ సినిమాల జ్ఞాపకాలను కూడా అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. ఇక 'కింగ్' సినిమా షూ టింగ్ నుంచి లీక్ అవుతున్న ఫోటోలు, వీడి యోలపై దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఈ లీకులు వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో, "దయచేసి లీక్ అయిన కంటెంట్‌ను షేర్ చేయొద్దు.

# ఓటీటీలోకి రానున్న మలయాళ డార్క్ కామెడీ .. పది రోజుల్లోనే 21 కోట్ల కలెక్షన్స్ రాబట్టిందా



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతున్న ఈ కాలంలో, భాషతో సంబంధం లేకుండా మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ముఖ్యంగా మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చే వైవిధ్య భరిత కథలు తెలుగు ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మలయాళంలో విమర్శకుల ప్రశంసలు అందుకున్న డార్క్ కామెడీ చిత్రం 'భరతనాట్యం–2 మోహినియాట్టం' ఇప్పుడు డిజిటల్ విడుదలకు సిద్ధమైంది. యువ నటుడు సాయిజు కురుప్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ కామెడీ మేళవింపుతో రూపొందింది. దర్శకుడు కృష్ణదాస్ మురళి ఈ సినిమాను వినూత్నంగా తెరకెక్కించి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. థియేటర్లలో విడుదలైనప్పుడు ఈ చిత్రానికి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, కథలోని వినూత్నత, హాస్యభరిత సన్నివేశాలు, కుటుంబ నేపథ్యంలో నడిచే ఆసక్తికరమైన కథనం ప్రత్యేకంగా నిలిచాయి.

తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా మే 8 నుంచి ప్రముఖ ఓటీటీ వేదికలో ప్రసారం కానుంది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే ఈ చిత్రాన్ని వీక్షించే అవకాశం పొందనున్నారు. ఓటీటీలో ఈ సినిమాకు మరింత ఆదరణ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా కథ ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం చుట్టూ తిరుగుతుంది. కుటుంబానికి సంబంధించిన కొన్ని రహస్యాలు బయటపడే పరిస్థితి వచ్చినప్పుడు,

# జూన్ 4న 'పెద్ది' ఎంట్రీ.. 'రావు బహదూర్'తో క్లాష్‌పై ఇండస్ట్రీలో చర్చలు



టాలీవుడ్‌లో ఆసక్తికరమైన బాక్సాఫీస్ పోటీకి రంగం సిద్ధమవుతోంది. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమా విడుదల తేదీగా జూన్ 4ను అధికారికంగా ప్రకటించారు. మొదట ఇదే తేదీకి రావాల్సిన 'టాక్సిక్' వాయిదా పడటంతో, సమ్మర్ హాలిడేస్‌ను క్యాష్ చేసుకునేలా 'పెద్ది'ని బరిలోకి దింపుతున్నారు. అయితే ఇదే వారం విడుదలకు సిద్ధమైన మరో సినిమా 'రావు బహదూర్' ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మహేష్ బాబు నిర్మాణ భాగస్వామ్యంతో, సత్యదేవ్ హీరోగా, వెంకటేష్ మహా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సైకలాజికల్ డ్రామాను జూన్ 5న విడుదల చేయాలని మేకర్స్ ముందుగానే ప్రకటించారు.

ఇప్పుడు 'పెద్ది' ఒక రోజు ముందుగా జూన్ 4న రావడంతో, ఈ రెండు చిత్రాల మధ్య క్లాష్ అనివార్యంగా కనిపిస్తోంది. భారీ క్రేజ్ ఉన్న 'పెద్ది'కి ఎక్కువ థియేటర్లు దక్కే అవకాశం ఉంది. దాంతో కంటెంట్ ఆధారిత చిత్రం అయిన 'రావు బహదూర్'కు సరిపడా స్క్రీన్లు దొరకడం సవాలుగా మారవచ్చు. థియేటర్ల కొరత ఏర్పడితే, సినిమా పాజిటివ్ టాక్ వచ్చినా కూడా వసూళ్లపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. అయితే 'రావు బహదూర్' టీమ్ మొదటగా జూన్ 4న యశ్ నటించిన 'టాక్సిక్' విడుదల ఉండబోతుందని తెలిసినా, అదే సమయానికి తమ చిత్రాన్ని రిలీజ్ చేయాలని నిర్ణయిం చుకుంది. ఇది తమ కంటెంట్‌పై ఉన్న నమ్మకాన్ని సూచిస్తుంది. ద

కానీ ఇప్పుడు ఆ తేదీకి రామ్ చరణ్ సినిమా రావడం పరిస్థితిని మార్చేసింది. ఇక రామ్ చరణ్ మరియు మహేష్ బాబు మధ్య ఉన్న స్నేహం కూడా ఈ క్లాష్‌పై ప్రభావం చూపవచ్చని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోటీని నివారించేందుకు 'రావు బహదూర్' విడుదల తేదీని వాయిదా వేసే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. మరి చివరికి ఈ రెండు సిని మాలు నిజంగా బాక్సాఫీస్ వద్ద తలపడ తాయా? లేక రిలీజ్ డేట్స్‌లో మార్పులు చోటుచే సుకుంటాయా? అనేది ఆసక్తికరంగా మారింది.

# పూజా కార్యక్రమాలతో మొదలైన గోపీచంద్ కొత్త సినిమా.. వి.వెంకట్ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్



యాక్షన్ హీరో గోపీచంద్ తన 34వ చిత్రాన్ని ఆదివారం నాడు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వి.వెంకట్, ఒక గ్రిప్పింగ్ మరియు రూటెడ్ కథతో ఈ సిని మా ను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు.

ఇటీవల విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. మండు తున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇది ఒక ఇంటెన్స్ స్పష్టమవుతోంది.